# మెట్రో ఈవినింగ్స్

ఎడిటర్ : దేవరకొండ కాళిదాస్

రూ.6/-

Estd : 1998, RNI No.68319/98


గోల్కొండ TV

హైదరాబాద్,బుధవారం,
ఏప్రిల్ 22, 2026
పేజీలు : 8+4
సంపుటి: 28,సంచిక:272

Published from Hyderabad | http://epaper.metroevenings.com | Metro Evenings Telugu Daily

బుధవారం, తేది:22-04-2026 శ్రీ పరాభవ నామ సంవత్సరం,చైత్ర మాసం,ఉత్తరాయణం-వసంత రుతువు,బహుళ పక్షం,పంచమి,షష్ఠి,వర్జ్యం,ప.12.32ల 2.01


## భూమికి అతి దగ్గరగా భారీ గ్రహశకలం



ఇంటర్నెట్ డెస్క్: భూమికి అతి దగ్గరగా ఈరోజు 2026ఎజీ1 అనే గ్రహశకలం వెళ్తుందని నాసా వెల్లడించింది. చిన్న బస్సు సైజులో ఉండే ఈ ఆస్టరాయిడ్ వెడల్పు 23 అడుగులు ఉంటుందని పేర్కొంది. దీని వల్ల భూమికి ముప్పు లేదని, ఖగోళ శాస్త్రవేత్తలు టెలిస్కోపులతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. ఇది భూమి నుంచి 4వా మైళ్ల దూరం నుంచి వెళ్లనుందని చెప్పింది. ఖగోళ పరంగా ఇది చాలా దగ్గరే అయినప్పటికీ భూమిని ఢీకొనే ఛాన్స్ లేదని నిపుణులు పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై
# నిషేధం ఎత్తివేత

### మే 1 నుంచి 31 వరకు బదిలీల ప్రక్రియ

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని ప్రభుత్వం సడలించింది. మే 1 నుండి మే 31వ తేదీ వరకు బదిలీల ప్రక్రియ జరుగుతుందని ప్రకటించింది. కనీసం 3 ఏళ్లు పూర్తి చేసిన ఉద్యోగులు బదిలీలకు అర్హులు అని పేర్కొంటూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఒకే చోట 4 ఏళ్లు దాటితే తప్పనిసరి బదిలీ కానున్నారు. అయితే 31 మే 2027కి ముందే రిటైర్ అయ్యే వారికి ఈ బదిలీల నుంచి మినహాయింపు ఉండనుంది. ఒక్కో కేడర్‌లో గరిష్టంగా 40 శాతం మందికే బదిలీలుంటాయి. భార్యాభర్తలు, వికలాంగులు, వైద్య కారణాలకు ప్రాధాన్యం లభించనుంది. అలాగే క్యాన్సర్, కిడ్నీ, హృదయ శస్త్రచికిత్స వంటి కేసులకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. కష్ట ప్రాంతాల్లో ఎక్కువ కాలం పనిచేసిన వారికి కూడా ప్రాధాన్యమిస్తారు. నినిబదిలీలు పూర్తిగా కౌన్సెలింగ్ విధానంలో నిర్వహించనున్నారు. ఆన్‌లైన్/వెబ్ ఆధారిత విధానం ద్వారా పారదర్శకతతో బదిలీలు ఉండనున్నాయి. ఖాళీల జాబితా, అర్హుల జాబితా ముందుగా ప్రకటిస్తారు. ఉద్యోగుల నుంచి 5 ఆప్షన్లు తీసుకుంటారు. కష్ట ప్రాంతాలకు సిబ్బంది లేని పక్షంలో లాటరీ విధానం ద్వారా బదిలీలు చేస్తారు. బదిలీ ఉత్తర్వులు వచ్చిన 3 రోజుల్లో రిలీవ్ అయినట్లు పరిగణిస్తారు. జూన్ 1 నుంచి మళ్లీ బదిలీలపై నిషేధం అమల్లోకి వస్తుంది. మొత్తం ప్రక్రియ పారదర్శకంగా, నియమావళి ప్రకారం ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

## వెయ్యేళ్లైనా బీఆర్ఎస్
# బాగుపడదు

### తెలంగాణ వ్యతిరేకిని చేర్చుకుంటారా..!
### బీఆర్ఎస్‌వి ఉత్త కథలు...కాంగ్రెస్‌వి పిట్ట కథలు



హైదరాబాద్ (మెట్రో న్యూస్): అధికార, ప్రతిపక్షాలు నిర్వహించిన సభల ద్వారా రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. రెండు సభల్లో బిఆర్ఎస్ ఉత్త కథలు చెబితే కాంగ్రెస్ పిట్ట కథలు చెప్పింది అని విమర్శించారు. బీఆర్ఎస్ సభలో ప్రజల సమస్యలపై ప్రస్తావించలేదని విస్మయం వ్యక్తం చేశారు. మహిళల బిల్లుపై కేంద్ర ప్రభుత్వాన్ని పల్లెత్తి మాట కూడా అనలేదన్నారు. మంగళవారం నాడు జాగృతి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ కారుల గూర్చి బిఆర్ఎస్ ఎక్కడ మాట్లాడటం లేదు... ఇప్పటికీ ప్రజలనే తప్పుపడుతున్నారని తెలిపారు. ఇక తెలంగాణ వ్యతిరేకి జీవన్ రెడ్డిని పార్టీలో చేర్చుకోవడాన్ని కూడా ఆమె తప్పుబట్టారు. వెయ్యి సంవత్సరాలైనా ఆ పార్టీ బాగుపడదు అని తేల్చి చెప్పారు. 75 సంవత్సరాల కురవృద్ధుడు బీఆర్ఎస్ లో ఏమి చేస్తారని ఎద్దేవా చేశారు. చరిత్ర చూస్తే... ఉద్యమ నాయకత్వంపైనే జీవన్ రెడ్డి పోటీ చేశారని గుర్తుచేశారు. నినిఇక సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను నికూడా కవిత తప్పుపట్టారు. ఎవరు అధికారంలో ఉండాలి... ఎవరు ప్రతిపక్షంలో ఉండాలో ఆయన ఎలా మాట్లాడతారు అన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉంటామని చెప్పడం ఏంటన్నారు. ప్రజలు కదా చెప్పాల్సింది అని పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రైవేటు పరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. ఆర్టీసీ సమ్మెకు పూర్తి పద్ధతి మద్దతు ప్రకటించారు. ఈనెల 25న కొత్త రాజకీయ శక్తిగా వస్తున్నాం... రాష్ట్రం నలువైపుల నుంచి ప్రజలు తరలిరావాలని పిలుపునిస్తున్నాం... సిరిసిల్ల నుంచి పాదయాత్రగా పార్టీ ఆవిర్భావ కార్యక్రమనికి వస్తున్నారు.

## 'ఓటుకు నోటు కేసులో రేవంత్‌కు శిక్షపడాలి'

హైదరాబాద్ (మెట్రో న్యూస్): కేసీఆర్ సభ రోజున తాను ఢిల్లీ వెళ్లడంపై వస్తున్న వదంతులపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు స్పందించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. తాను ఢిల్లీ వెళ్తే సీఎంవో నుంచి లీకులు ఇప్పించాడని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. బుధవారం నాడు కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు ఇవ్వబోతుందని పేర్కొన్నారు. హైకోర్టులో న్యాయం జరుగుతుందని తమకు నమ్మకం ఉందని తెలిపారు.

# ఒప్పందం లేకపోతే యుద్ధమే




ఇంటర్నెట్ డెస్క్: ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ముగింపు దశకు చేరుకోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. బుధవారంతో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణ ఒప్పందం గడువు ముగిసిన తర్వాత ఇరాన్‌తో యుద్ధానికి సిద్ధమవుతామని ప్రకటించారు.కాల్పుల విరమణ గడువు ముగిసేలోగా ఒప్పందం కుదరకపోతే, ఇరాన్‌తో తిరిగి యుద్ధానికి వెళ్లడానికి మేం సిద్ధంగా ఉన్నాం అని ట్రంప్ ప్రకటించారు. ఈ రోజు (మంగళవారం) ఇస్లామాబాద్‌లో ఇరాన్, అమెరికా ప్రతినిధుల మధ్య రెండో దఫా శాంతి చర్చలు జరగాల్సి ఉంది. అయితే బెదిరింపుల నీడలోనూ, అమెరికా నావికా దిగ్బంధనం కొనసాగుతున్న నేపథ్యంలోనూ చర్చలు జరపబోమని టెహ్రాన్ స్పష్టం చేసింది. ముందుగా అమెరికా తన చర్యలను ఆపాలని డిమాండ్ చేసింది.కాగా, ఇరాన్‌తో తమతో శాంతి ఒప్పందం కుదుర్చుకునే వరకు నౌకా దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం చేశారు .

### కేరళలో ఘోర విషాదం...
## బాణసంచా పరిశ్రమలో పేలుడు -13 మంది మృతి



ఇంటర్నెట్ డెస్క్: కేరళలోని ప్రసిద్ధ త్రిస్సూర్ పూరం వేడుకల్లో ఘోర విషాదం చోటుచేసుకుంది. బాణసంచా తయారీ కేంద్రంలో సోమవారం జరిగిన భారీ పేలుడులో 13 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. భారత దేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన ఆలయ ఉత్సవాల్లో ఒకటైన త్రిస్సూర్ పూరం కోసం బాణసంచా సిద్ధం చేస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.

### ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి



ఫైల్

## ఉన్నతాధికారులతో కమిటీ

హైదరాబాద్ (మెట్రోన్యూస్): ఆర్టీసీకి సంబంధించిన సమస్యలను పరిశీలించడానికి నలుగురు సభ్యులతో ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీఓఎంఎస్ నంబర్ 66ను విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగుల నుంచి, వారి సేవా నిబంధనలు, సంబంధిత విషయాలపై పలు సమస్యలను లేవనెత్తుతూ ప్రభుత్వానికి వినతులు అందుతున్నాయి. ఈ వినతులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు లేవనెత్తిన సమస్యలను పరిశీలించి, తగిన సిఫార్సులను సూచించడానికి ప్రభుత్వం అధికారుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి వికాస్ రాజ్ (ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రవాణా రహదారులు భవనాల శాఖ) చైర్మన్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా...దానకిశోర్ (ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కార్మిక, ఉపాధి,శిక్షణ,కర్మాగారాల శాఖ), సందీప్ సుల్తానియా (ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ), సభ్యుడు, కన్వీనర్‌గా వి.నాగిరెడ్డి (వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, టీజీఎస్ఆర్టీసీ) ఉంటారు.

## ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల్లో ఒకటిగా మంచిర్యాల



హైదరాబాద్ (మెట్రోన్యూస్): తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలకు రాష్ట్ర ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండల తీవ్రత ఏ స్థాయిలో ఉందంటే, మంచిర్యాల ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల్లో ఒకటిగా నిలిచింది. అమెరికాకు చెందిన ప్రముఖ వాతావరణ సంస్థ ఎల్డోరాడో వెదర్ తాజాగా రూపొందించిన ప్రపంచంలోని 100 అత్యంత వేడి నగరాల జాబితాలో మంచిర్యాల 14వ స్థానంలో నిలవడం గమనార్హం.సోమవారం (ఏప్రిల్ 20) మంచిర్యాలలో 43.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎల్డోరాడో వెదర్ జాబితాలో మహారాష్ట్రలోని అకోలా 45 డిగ్రీలతో అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలను పరిశీలిస్తే.. కొత్తగూడెం, గద్వాలలో 43.3, నిర్మల్, నిజామాబాద్‌లలో 43.0 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతంలో ఎండలు ఇంత తీవ్రంగా ఉండటానికి భౌగోళిక కారణాలతో పాటు అటవీ విస్తీర్ణం తగ్గడమే ప్రధాన కారణమని వాతావరణ శాఖ (ఐఎండీ) శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు.

## బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణంపై కేసీఆర్ స్పెషల్ ఫోకస్



### 27న బీఆర్ఎస్ రజతోత్సవ సంబురాల ముగింపు వేడుకలు

హైదరాబాద్ (మెట్రో న్యూస్): భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ రజతోత్సవ సంబురాల ముగింపును పురస్కరించుకుని, పార్టీ అధినేత కె. చంద్రశేఖర్ రావు అధ్యక్షతన ఈ నెల 27వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఈ భేటీ జరగనుంది. పార్టీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించిన గులాబీ బాస్, ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనునే అవకాశం ఉన్నది. ముఖ్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వాల పునరుద్ధరణ వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీ క్యాడర్‌ను ఎలా ముందుకు తీసుకెళ్లాలి, సభ్యత్వ నమోదు ప్రక్రియను ఏ విధంగా వేగవంతం చేయాలి అనే విషయాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి పార్టీకి చెందిన ముఖ్య నేతలందరినీ ఆహ్వానించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తప్పనిసరిగా హాజరుకావాలని పార్టీ వర్గాలు తెలిపాయి.

### కౌంటింగ్ వరకు..
## స్ట్రాంగ్ రూమ్‌లు తెరవొద్దు: ఈసీ

ఇంటర్నెట్డెస్క్: కేరళ లోని జిల్లా ఎన్నికల అధికారులకు ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఓట్ల లెక్కింపు ముందువరకు ఎట్టి పరిస్థితుల్లోనూ (స్టాంగ్ రూమ్లను తెరవకూడదని ఆదేశాలు జారీచేసింది. కొయ్కడ్ జిల్లాలోని పెరంబ్ర నియోజకవర్గంలోని ఈవీఎంలను ఉంచిన (స్టాంగ్ రూమ్ను తెరిచినట్లు ప్రచారం జరిగింది. దీంతోపాటు పాలక్కాడ్లోని నెన్మర నియోజకవర్గంలోని మరో (స్టాంగ్ రూమ్ తెరిచేందుకు యత్నించారన్న కథనాలు వెలువడ్డాయి. ఇదికాస్తా రాజకీయ దుమారం రేపింది.

# డిఎంకే కూటమిదే విజయం

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

చెన్నై (మెట్రో న్యూస్):తమిళనాడులో డిఎంకే కాంగ్రెస్ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడు శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ పరిశీలకుడు, మాజీ ఎంపీ మధు యాష్కీ, డిప్యూటీ సీఎం భట్టి కలిసి రాణిపేట జిల్లా షోలింగర్ నియోజకవర్గంలో నీ కారిక్కల్ , వీరనట్టుర్, అరియూర్, అయిపేడు ప్రాంతాల్లో మంగళవారం విస్తృతంగా పర్యటించి, కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. తమిళ ప్రజలు అభివృద్ధి, లోకికవాదానికే ప్రజల పట్టం కడతారని చెప్పారు. ఆత్మగౌరవానికి తమిళ ప్రజల మద్దతు చెబుతారని ఆకాంక్షించారు. ఎం.కె. స్టాలిన్ నాయకత్వంలోని ప్రభుత్వం భారీ మెజారిటీతో తిరిగి అధికారాన్ని కైవసం చేసుకోబోతోందని భట్టి చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకత్వంలోనీ ప్రజా ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలే కాకుండా, ఇవ్వని హామీలు కూడా అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అనుమానం ఉంటే ఎవరైనా వచ్చి పరిశీలించవచ్చన్నారు. తమిళనాడు రాజకీయాలు దేశానికే దిక్సూచిగా నిలుస్తాయని కొనియాడారు. తమిళనాడు అంటే కేవలం ఒక రాష్ట్రం కాదు, అదొక



గొప్ప సిద్ధాంతం. పెరియార్, అన్నాదురై, కరుణానిధి వంటి మహనీయులు ఇక్కడ సామాజిక న్యాయానికి బలమైన పునాదులు వేశారని ఆయన పేర్కొన్నారు. లౌకికవాదాన్ని కాపాడటంలో తమిళ ప్రజలు ఎప్పుడూ ముందుంటారని ఆయన ప్రశంసించారు.

## చెర్లపల్లి సెంట్రల్ జైలును సందర్శించిన ట్రైనీ అధికారులు

హైదరాబాద్ (మెట్రో న్యూస్ ): నేషనల్ పోలీస్ అకాడమీకి చెందిన ఆర్.ఆర్. 77వ బ్యాచ్ ట్రైనీ ఐపీఎస్ అధికారులు, ఆర్‌బీవీ ఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీకి చెందిన 102 మంది గ్రూప్– ట్రైనీ అధికారులు తమ ఫీల్డ్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా చెర్లపల్లి సెంట్రల్ జైలును మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్,సౌమ్య మీశ్ర ట్రైనీ అధికారులకు జైలు పరిపాలన ఖైదీల సంస్కరణ కోసం చేపడుతున్న చర్యలపై అవగాహన కల్పించారు. జైళ్లలో అమలు చేస్తున్న కొత్త కార్యక్రమాలను, ముఖ్యంగా "నివృత్తి" అనే ప్రథమ ప్రయత్నం కింద అన్ని సెంట్రల్ జైళ్లలో మరియు మహిళా ప్రత్యేక జైలులో డీ–అడిక్షన్ సెంటర్ల స్థాపన గురించి వివరించారు సందర్శన సందర్భంగా ట్రైనీ అధికారులు జైలు పరిధిలోని వివిధ విభాగాలను సందర్శించారు ఈ సందర్శనతో ట్రైనీ అధికారులు ఎంతో ప్రభావితులయ్యారుఈ కార్యక్రమంలో అధికారులు ఎన్. మురళీ బాబు, డి. శ్రీనివాస్, జి. ప్రమోద్,.భరత్, సతీష్ కుమార్ సి. దేవా రెడ్డి,లు పాల్గొన్నారు.




## రూ. 10 లక్షల డిఫెన్స్ మద్యం పట్టివేత

- బెంగళూరు హర్యానా డిఫెన్స్ క్యాంటీన్ల నుంచి దిగుమతి
- డిఫెన్స్ ప్రీమియం లిక్కర్‌ను బడా బాబులకు అమ్మకాలు



హైదరాబాద్ (మెట్రో న్యూస్ ): అతనొక రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి. పేరు దొడ్ల సురేష్ రెడ్డి సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన ఈ రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి బెంగళూరు, హర్యానా డిఫెన్స్ క్యాంటీన్లో నుంచి ఖరీదైన ప్రీమియం లిక్కర్ ను హైదరాబాద్ కు తీసుకువచ్చి బడా బాబులకు అమ్మకాలు జరుపుతున్నారు.ఈ సమాచారం అందుకున్న ఈ ఎస్.. జీవన్ కిరణ్, ఎన్ఫోర్స్మెంట్ సీఐ సుభాష్ చందర్, ఎస్సై అఖిల్, సిబ్బంది కలిసి మంగళవారం తెల్లవారు జామున హస్తినాపురంలో ఒక ఇంట్లో దాచిపెట్టిన 361 ప్రీమియం మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు.పట్టుకున్న మద్యం బాటిల్ల విలువ రూ.10 లక్షలు గా ఉంటుందని అంచనా వేశారు. హస్తినాపురంలోని శ్రీ రమణ కాలనీ ఫేస్ టు ఇంట్లో ఈ మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నట్లు ఈ ఎస్ జీవన్ కిరణ్ తెలిపారు. దొడ్ల సురేష్ రెడ్డి పరారయ్యాడని అబ్కారీ అధికారులు తెలిపారు. పెద్ద మొత్తంలో మద్యం బాటిల్లు పట్టుకున్నటువంటి ఎన్ఫోర్స్మెంట్ టీమును ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షాన్వాస్ కాసిం, డిప్యూటీ కమిషనర్ దశరథ్, అసిస్టెంట్ కమిషనర్ ఆర్‌కిషన్‌లు అభినందించారు.

## తెలంగాణ పర్యాటక రంగానికి జాతీయ గుర్తింపు

### మంత్రి జూపల్లి హర్షం




హైదరాబాద్, (మెట్రో న్యూస్ ): నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన దివ్య భారత్ పర్యాటక నివేదికలో తెలంగాణ రాష్ట్రానికి విశిష్ట గుర్తింపు లభించింది. ఇందుకు పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వైవిధ్యభరితమైన పర్యాటక సామర్థ్యానికి ఈ నివేదిక అద్దం పడుతోందని, ఇది తెలంగాణకు గర్వకారణమని అన్నారు. తెలంగాణ పర్యాటక రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ గుర్తింపు నిదర్శనమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజధానిలోని హుస్సేన్ సాగర్, చారిత్రక గోల్కొండ కోట, భువనగిరి కోట వంటి కట్టడాలతో పాటు ఆధ్యాత్మికత ఉట్టిపడే యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం వంటి ప్రసిద్ధ క్షేత్రాలు నిత్యం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని వివరించారు. కేవలం చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాలే కాకుండా ప్రకృతి ఒడిలో విరాజిల్లే కుంటాల, బొగత జలపాతాలు, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా పేరొందిన సమ్మక్క-సారలమ్మ మేడారం జాతర వంటి సాంస్కృతిక వేడుకలు రాష్ట్ర పర్యాటక రంగానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చాయని మంత్రి చెప్పారు. అలాగే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పోచంపల్లి ఇక్కత్ వంటి సంప్రదాయ కళలు పర్యాటక రంగాన్ని మరింత సుసంపన్నం చేస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.రాష్ట్రంలోని సుసంపన్నమైన సంప్రదాయాలు, రుచికరమైన వంటకాలు, ప్రకృతి రమణీయమైన దృశ్యాలను తిలకించేందుకు దేశ విదేశీ పర్యాటకులు తరలిరావాలని మంత్రి పిలుపునిచ్చారు. పర్యాటక రంగంలో మౌలిక సదుపాయాల కల్పనను మరింత బలోపేతం చేయడంతో పాటు, తెలంగాణ పర్యాటక వైభవాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేసేందుకు ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని జూపల్లి కృష్ణారావు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## భూమి హక్కులకు శాశ్వత భరోసా

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ (మెట్రో న్యూస్): రైతు జీవితం భూమితో ముడిపడి ఉందని ఆ భూమిపై హక్కు స్పష్టంగా ఉన్నప్పుడే అతని జీవితం భద్రంగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆ హక్కును సర్వే మ్యాప్‌తో, భూధార్ నెంబర్‌తో శాశ్వతంగా నిర్ధారించినపుడే రైతుకు ధైర్యం, కుటుంబానికి భరోసా, భవిష్యత్తుపై నమ్మకం కలుగుతుందని తెలిపారు. ఈ దిశగా రెవెన్యూ వ్యవస్థను సమూలంగా బలోపేతం చేస్తూ, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. మంగళవారం నాడు ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని కుసుమంచి మండలంలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్ చేసి చారిత్రాత్మకమైన అడుగు వేశామని అన్నారు. సర్వేమ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్ అయిన సందర్భంగా మంత్రి స్పందిస్తూ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఇదే విధానాన్ని దశలవారీగా రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసి భూవివాదాలకు శాశ్వత




పరిష్కారం లభించేవిధంగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు.

## రెండో విడత రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి



మెట్రో న్యూస్, కాటారం: కాటారం మండలం నస్తూరుపల్లిలో బహిరంగ సభలో రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ చేశారు.కాంగ్రెస్ రైతు సంక్షేమం నినాదం కాదు.. విధానందేశ వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులు కట్టి..పంటకుక గిట్టుబాటు ధర తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్–రేవంత్వరికి రూ.500 బోనస్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణసీఎం రేవంత్పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాంపదేళ్లలో పేదలకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారా?సీఎం రేవంత్సన్నబియ్యం ఇస్తున్నందుకు ప్రజాపాలన పోవాలా?మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిం చినందుకు ప్రజాపాలన పోవాలా?–రేవంత్ రెడ్డికేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్ కార్యకర్తల సాక్షిగా ఇదే నా సవాల్–రేవంత్‌రెడ్డి 2029లో తేల్చుకుందాం.. దమ్ముంటే రండిఎవరూ వచ్చినా తొక్కుకుంటూ వెళ్తాం–రేవంత్‌రెడ్డివచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రతిపక్ష హోదా కూడా రానివ్వం2034 వరకు తెలంగాణలో కాంగ్రెస్ పాలన ఉంటుంది. కాళేశ్వరంలో లక్ష కోట్లు ముంచారు–రేవంత్‌రెడ్డి కేసీఆర్‌కు ఉరి వేసినా తప్పులేదువరుస ఎన్నికల్లో మీకు ఘోరీ కట్టాం –రేవంత్‌రెడ్డివచ్చే ఎన్నికల్లో నువ్వో..నేనో తేల్చుకుందాం వైఎస్ –డీఎస్‌లా.. నేను–మహేష్‌గౌడ్ చరిత్ర పునరావృతం చేస్తాం–రేవంత్.

## నార్వే కంపెనీలను ప్రోత్సహించండి

### నార్వే డెలిగేట్లతో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ (మెట్రో న్యూస్):లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆయా రంగాల్లో రాష్ట్రంలో కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసేలా నార్వే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆ దేశ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని కోరారు. సచివాలయంలో మంగళవారం ఆ దేశ రాయబారి మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. 'తెలంగాణ నార్వే' దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమగ్రంగా చర్చించింది. వివిధ అంశాల్లో కలిసే పనిచేసేందుకు గల అవకాశాలపై 'కాంప్రహె



న్సివ్ రోడ్డు మ్యాప్'ను సిద్ధం చేసుకుని ముందుకెళ్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా 'తెలంగాణ నార్వే వర్కింగ్ గ్రూప్'ను ఏర్పాటు చేద్దామని మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపాదించారు. 'తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పనిచేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం అని మంత్రి తెలిపారు.

## కవిత పార్టీ ఆవిర్భావ సభకు సిరిసిల్ల నుంచి పాదయాత్రగా...

హైదరాబాద్ (మెట్రో న్యూస్):జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ ఆవిర్భావ సభ సమీపిస్తున్న నేపథ్యంలో జాగృతి కార్యాలయం సందడిగా మారింది. గత వారం పది రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు చేరికలతో జాగృతి కార్యకర్తలు, నాయకుల్లో కొత్త జోష్ కనిపిస్తోంది. ఈనెల 25న ఆవిర్భావ సభ ఉండటంతో తెలంగాణ జిల్లాల నుంచి జాగృతి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం రాజన్న సిరిసిల్ల నుంచి పాదయాత్ర మొదలైంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మునీరాబాద్‌లో ఉన్న అద్వయ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకొని పార్టీ ఆవిర్భావ సభలో పాల్గొంటారు.



## కొంప ముంచిన గంజాయి గంజాయి అలవాటుతో స్టాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఊస్ట్

హైదరాబాద్ (మెట్రో న్యూస్ ): స్టాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చిందని తల్లిదండ్రులు సంతోష పడ్డారు. ఆరు నెలల సావాసం వారును.వీరుగా మారుతారన్నది నిజమైంది స్టాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేరిన సిహెచ్. శశిధర్ అనే యువకుడు గంజాయికి అలవాటు పడ్డాడు. వచ్చిన జీతమంత గంజాయికే తగలేశాడు. చివరకు గంజాయినికి బానిసగా మారి స్టాఫ్‌వేర్ ఉద్యోగాన్ని వదిలేసుకున్నాడు.గంజాయిని కొనుగోలు చేయడానికి డబ్బులు లేక పోవడంతో తన ఇంటి మీద గంజాయి మొక్కలను పెంచుకుంటున్నాడు. ఈ సమాచారం అందుకున్న రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏ టీమ్ సీఐ బాలరాజు సిబ్బంది కలిసి ఈ స్ట్ గాంధినగర్ నాచారంలో ఇంటిపై దాడి చేసి 17 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల్లో కొన్ని పూతకు వచ్చాయి. మరికొన్ని మూడు మీటర్ల మేర పెరిగాయి. గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌ను అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్, ఈఎస్ జీవన్ కిరణ్‌లు అభినందించారు.



## 2039 వరకు కాంగ్రెస్‌దే అధికారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్గొండ (మెట్రో న్యూస్):బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడో విచ్ఛిన్నమైందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల... ఆస్తుల పంపకాల కోసం ఆ కుటుంబంలో తండ్రి– కొడుకులు, అన్నా– చెల్లెలు, మామ –అల్లుడు మధ్య పోరు జరుగుతోందన్నారు. నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. 2039 వరకు కాంగ్రెస్ పార్టే అధికారంలో ఉంటుందని తేల్చిచెప్పారు. కేసీఆర్ ఫ్రస్టేషన్లో ఉన్నారు, అందుకే నిన్న జరిగిన సభలో నోటికి వచ్చినట్లు మాట్లాడారు. కేసీఆర్ ముందు ఇల్లు చక్కదిద్దుకో... తర్వాత పార్టీ గురించి ఆలోచించు అని హితవు పలికారు. అబద్ధం ఆడడంలో కేసీఆర్‌ను మించినోడు ఇంకెవరూ లేరని మంత్రి పేర్కొన్నారు. గతంలో దళితుడే సీఎం, ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాల భూమి లాంటివి... ఎన్నో వాగ్ధానాలు చేశారు. మరి అవన్నీ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. జీవన్ రెడ్డి లాంటి వాళ్లు బీఆర్ఎస్ పార్టీలో చేరడం సరైన నిర్ణయం కాదని మంత్రి కోమటిరెడ్డి అభిప్రాయపడ్డారు.

## మహిళా బిల్లుకై పోస్ట్‌కార్డు ఉద్యమం

- ప్రస్తుత 543 లోక్‌సభ సీట్లలోనే అమలు చేయాలి
- ఎమ్ సీసీ అధ్యక్షురాలు :స్వర్ణ

హైదరాబాద్ (మెట్రో న్యూస్ ): తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలంటూ మంగళవారం గాంధీభవన్ లో పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. మహిళా ఆరక్షన్ బిల్ ఆజ్ కరో అభి కరో అనే నినాదంతో పోస్ట్‌కార్డు పై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టి ప్రధాని కార్యాలయానికి పంపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ పార్లమెంట్ 2023 సెప్టెంబర్‌లో ఏకగ్రీవంగా ఆమోదించిన నారీ శక్తి వందన్ అధినియమ్ 2023ను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ కోసం కొత్త జనగణన, డీలిమిటేషన్ పేరుతో కాలయాపన చేయకుండా 2023 చట్టాన్ని ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లకు వర్తింపజేసి, 2029 సార్వత్రిక ఎన్నికల నుండే 33% సీట్లు మహిళలకు కేటాయించాలన్నారు.మహిళా రిజర్వేషన్‌ను డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే కుట్ర. కుల గణన లేకుండా ఎన్నికల మ్యాప్‌ను మార్చే ప్రయత్నాన్ని అంగీకరించమని తెలిపారు ఇది సమాఖ్య స్ఫూర్తికి, రాజ్యాంగానికి వ్యతిరేకమని ఆమె పేర్కొన్నారు.2023 మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ప్రస్తుత సీట్ల ప్రకారం అమలు చేసేందుకు కేంద్రం ఏ సవరణలు తీసుకొచ్చినా ఇండియా కూటమి పూర్తి మద్దతు ఇస్తుందన్నారు 33% రిజర్వేషన్‌లో ఎస్‌సీ, ఎస్‌టీ మహిళలతో పాటు ఓబీసీ మహిళలకు కూడా సబ్–కోటా కల్పించాలని సామాజిక న్యాయం లేని రిజర్వేషన్ అసంపూర్ణమని స్వర్ణ వివరించారు. మోదీ గ్యారంటీ అని చెప్పి



మహిళలను మోసం చేసిందని బీజేపీ అని ఆమె తెలిపారు.బిల్లు పాస్ చేశామని చెప్పుకుంటూ, అమలు మాత్రం చేయకుండా మహిళల ఆకాంక్షలతో ఆటలాడుకుంటోందన్నారు బీజేపీ స్వార్థ రాజకీయాల కోసం మహిళా సాధికారతను తాకట్టు పెట్టడాన్ని దేశం గమనిస్తోందన్నారు.మహిళలకు న్యాయం జరగాలంటే బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళల పక్షాన నిలబడుతుందని ఆమె తెలిపారు.

## మేఘాలయ పర్యటనకు మంత్రి సీతక్క

- అంగన్వాడీ సేవలను పరిశీలించనున్న మంత్రి

హైదరాబాద్ (మెట్రో న్యూస్): మేఘాలయ రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క బుధవారం నాడు మేఘాలయకు పర్యటనకు వెళ్లనున్నారు. స్టేట్–టు–స్టేట్ భాగస్వామ్య కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు మంత్రి అక్కడి కార్యక్రమాలను పరిశీలించనున్నారు. ఈ పర్యటనలో మహిళా శిశు అభివృద్ధి రంగంలో మేఘాలయ అమలు చేస్తున్న పలు కీలక కార్యక్రమాలను మంత్రి అధ్యయనం చేయనున్నారు. ముఖ్యంగా "మిషన్ థౌజండ్ డేస్", శిశువుల అభివృద్ధి కార్యక్రమాలు, అంగన్‌వాడి కేంద్రాల అభివృద్ధి వంటి అంశాలను పరిశీలించనున్నారు. అలాగే మహిళా శిశు సంక్షేమంపై ఆసియా అభివృద్ధి బ్యాంక్, ఇతర సాంకేతిక భాగస్వామ్య సంస్థలు నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు. ఈ పర్యటనలో తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓజా కూడా మంత్రితో పాటు ఉంటారు.

BREAKING EDITION

# జోష్ తగ్గిన కేసీఆర్ స్పీచ్

## ఆనాటి కాన్ఫిడెన్స్ ఏమైంది



హైదరాబాద్ (మెట్రోన్యూస్): కేసీఆర్ రాజకీయంగా దెబ్బతిన్నారు. ఆయన బయటకు వస్తే టైగరే.. అన్నట్లుగా బీఆర్ఎస్ నేతలు ఎలివేషన్లు ఇచ్చారు. గతంలో కేసీఆర్ తన మాటలతోనే ఉద్యమాన్ని రగల్చారు. అందుకే అందరూ అంచనాలు పెంచుకు న్నారు. కానీ ఆ అంచనాలకు తగ్గట్లుగా స్పీచ్ లేదు.అంతకు మించి ఆయన పై ఆయనకు నమ్మకం తగ్గినట్లుగా స్పీచ్ ఉంది. తెలంగాణ ఉద్యమంలో తానేం చేశానో చెప్పుకునేందుకు ఎక్కువ సమయం తీసుకున్నారు. నమ్మకం లేనట్లుగా .. తానే వస్తానని చెప్పుకునేందుకు ఆసక్తి చూపారు. సీఎం సీఎం నినాదులు చేయించుకోవడం మరింత ఎబ్బెట్టుగా ఉంది.సాధారణంగా కేసీఆర్ సభ అంటే.. ఒక యుద్ధతంత్రంలా ఉంటుంది. కానీ, జగిత్యాలలో ఆయన తన పదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పుకోవడానికే ఎక్కువ సమయం వెచ్చించారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ అస్త్రంగా వాడుకుంటున్న 'మేడిగడ్డ' వైఫల్యంపై ఆయన గట్టిగా నోరు మెదపలేకపోవడం.. ఆయనలోని నైతిక స్థైర్యం దెబ్బతిన్నదనే సంకేతాలను పంపింది.

ఒకప్పటి వాడివేడి విమర్శలు, వ్యంగ్యాస్త్రలు ఈ సభలో పెద్దగా కనిపించలేదు. జనంతో మమేకమవ్వడం కేసీఆర్ శైలి. కానీ ఈసారి సభలో ఆయనకు, ప్రజలకు మధ్య ఒక స్పష్టమైన దూరం కనిపించింది. స్థానిక సమస్యల కంటే, హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న హైడ్రా కూల్చివేతల గురించి జగిత్యాల సభలో మాట్లాడటం ఏ రకమైన వ్యూహమో ఎవరికీ అర్థం కాలేదు.

రేవంత్ రెడ్డి తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని నా చావు కోరుకుంటున్నారని కేసీఆర్ మాట్లాడటం వినేవాళ్లకూ ముఖ్యంగా కేసీఆర్ బాహుబలిగా భావించే క్యాడర్ కు కూడా అంత గొప్పగా అనిపించలేదు. సానుభూతి కోసం ఇలా మాట్లాడుతున్నారన్న అభిప్రాయం వస్తుంది. జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించిన తీరు, ఆయనకు ఇచ్చిన ప్రాధాన్యత చూస్తుంటే బీఆర్ఎస్ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో కేసీఆరే స్వయంగా అంగీకరించినట్లు అనిపించింది. దశాబ్దాలుగా గెలవని ఒక సీనియర్ నేతను సేవియర్ అన్నట్లుగా చిత్రించడం ద్వారా, క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ చెల్లాచెదురైందనే నిజాన్ని ఆయన ఒప్పుకున్నట్లయింది. పార్టీలో నూతన ఉత్తేజం నింపాల్సిన బాధ్యతను తన భుజాలపై వేసుకోకుండా, మరొకరిపై భారం వేయడం ఆయనలోని నాయకత్వ లోపాన్ని ఎత్తిచూపింది.

కేసీఆర్ ఎవర్నీ గట్టిగా విమర్శించలేకపోయారు. ప్రధాన విషయాలనూ చర్చించలేదు. మేడిగడ్డ సమస్య అనుకుంటే.. మోడీని కూడా పట్టించుకోలేదు. సభ తర్వాత కేసీఆర్ మళ్లీ ప్రజల్లోకి వచ్చి నిరంతరం పోరాటం చేస్తారనే ఆశలు కూడా అడియాశలయ్యాయి. బస్సు యాత్రలు లేదా నిరంతర పర్యటనల గురించి ఆయన ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. నాటి ఉద్యమ కేసీఆర్‌లో ఉన్న ఆ పదును, ఆ కసి నేటి కేసీఆర్‌లో కనిపించక పోవడం.. గులాబీ పార్టీ కి ఇంకా కావాల్సిన ఊపు రాలేదని అనిపించేలా చేస్తోంది. ఈ సభకు హరీష్ రావే కాదు.. కేటీఆర్ కూడా హాజరు కాకపోవడం పార్టీలో అంతర్గత పరిణామాల్ని మరింతగా చర్చకు వచ్చేలా చేస్తోంది.

## తమిళనాడు ఎన్నికల వేళ ధన ప్రవాహం

### 1200 కోట్లకు పైగా సొమ్ము సీజ్

ఇంటర్నెట్ డెస్క్: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ఇంకా కొన్ని రోజులే సమయం ఉండటంతో ఎన్నికల అధికారులు తనిఖీలను తీవ్రతరం చేశారు. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్‌కు ముందు రాష్ట్రవ్యాప్తంగా భారీగా నగదు, బంగారం, మద్యం, మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు పట్టుబడిన సొమ్ము, వస్తువుల మొత్తం విలువ రూ.1200 కోట్లు దాటిందని అధికారులు తెలిపారు.

ఎన్నికల పర్యవేక్షణ బృందాలు నేరుగా రూ.500 కోట్లకు పైగా విలువైన నగదు, వస్తువులను సీజ్ చేయగా, ఆదాయపు పన్ను శాఖ వంటి ఇతర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు జరిపిన సోదాల్లో మిగతా మొత్తం పట్టుబడింది. నగదుతో పాటు, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉద్దేశించిన భారీ మొత్తంలో మద్యం, నిషేధిత పదార్థాలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో కూపన్లు, ఇతర ఉచితాలను పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి సుమారు 100 కేసులు నమోదు చేశారు. జిల్లాల వారీగా చూస్తే, తిరువళ్లూరులో అత్యధికంగా సొమ్ము పట్టుబడగా, ఆ తర్వాత చెన్నై నిలిచింది.

## కొత్త సీఈవో యాపిల్ ఉత్పత్తుల్లో ఎక్స్‌పర్ట్



ఇంటర్నెటెస్క్: టిమ్ కుక్ స్థానంలో యాపిల్ కొత్త సీఈవోగా బాధ్యతలు చేపట్టనున్న జాన్ టెర్నస్ 2001లో ఆ సంస్థలో చేరారు. మ్యాక్స్ (ల్యాప్టాప్స్+డెస్క్టాప్), ఐప్యాడ్స్, ఎయిర్‌పోడ్స్ ఉత్పత్తుల తయారీలో ఈయన కీలక పాత్ర పోషించారు. కాంపిటీషన్ ను తట్టుకొని మ్యాక్స్ ఇమేజ్‌ను నిలబెట్టడంలో సక్సెస్ అయ్యారు. యాదృచ్ఛికంగా కుక్, టెర్నస్ ఇద్దరూ 50ఏళ్లకే సీఈవో అయ్యారు. యాపిల్ ఉత్పత్తుల్లో ఏఐని మరింత పెంచడం ప్రస్తుతం ఆయన ముందున్న సవాల్.

## మహిళా భరోసా ఇవ్వని బీఆర్ఎస్ సభ

### యువతకు ప్రాధాన్యతతో కొత్త పార్టీ



హైదరాబాద్ (మెట్రోన్యూస్): మాజీ సీఎం కేసీఆర్ జగిత్యాల సభపై కవిత సెటైర్లు వేశారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నా నిన్నటి సభల్లో ప్రభుత్వం పిట్టకథలు, ప్రతిపక్షం ఉట్టికథలు చెప్పాయన్నారు. వెయ్యేళ్లయినా బీఆర్ఎస్, కాంగ్రెస్ మారవన్నారు. బీఆర్ఎస్‌లో మహిళలకు ప్రాధాన్యం లేదన్నారు. 75 ఏళ్ల జీవన్ రెడ్డి యువకుడైతే రాష్ట్రంలోని యువత ఏమవ్వాలని ప్రశ్నించారు. ఈ నెల 25న పెట్టబోయే తమ పార్టీలో యువతకు మంచి అవకాశాలు ఉంటాయన్న ఆమె..ఆర్టీసీ సమ్మెకు మద్దతు తెలిపారు.




## లంచం తీసుకుంటూ.. ఏసీబీ వలలో ఆర్డీవో

హైదరాబాద్ (మెట్రోన్యూస్): లంచాలు ఇవ్వడం, తీసుకోవడం నేరం.. లంచాలను ప్రోత్సహించొద్దని, అవినీతికి పాల్పడుతున్న అధికారులను నియంత్రించేందుకు ఏసీబీ అధికారులు ఎన్ని హెచ్చరికలు చేసినా ఎక్కడో ఒక చోట అవినీతి బయటపడుతూనే ఉంది. బాధ్యత గల ఉద్యోగాల్లో ఉండి ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు ఆ విషయాన్ని మరిచిపోయి లంచాలు దండుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడుతున్నారు. తాజాగా ఓ ఆర్డీవో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు.నారాయణపేట ఆర్డీవో కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఓ వ్యక్తి నుంచి 25వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఆర్డీవో రాంచంద్ర నాయక్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## కూటమి నేతల ప్రకటనలు సముచితంగా లేవు

### ఏపీ సీఎం చంద్రబాబుకు మంత్రి పొన్నం లేఖ

హైదరాబాద్ (మెట్రోన్యూస్): ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ రా(ష్ట్రాల విభజన అంశం మళ్ళీ తెరపైకి వచ్చింది. ఈ అంశానికి సంబంధించి తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ఏపీ సీఎం చంద్రబాబుకి లేఖ రాశారు. రాష్ట్ర విభజనపై ఇటీవల కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలు రెండు రా(ష్ట్రాల మధ్య చిచ్చు పెట్టేలా ఉన్నాయని లేఖలో పొన్నం ఆందోళన వ్యక్తం చేశారు. విభజనను తప్పుబడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు చేస్తున్న ప్రకటనలు సముచితంగా లేవని... ఇవి ప్రజల మధ్య విద్వేషాలను రగిలించే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.ముఖ్యంగా, లోక్‌సభలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య రాష్ట్ర విభజనపై చేసిన వ్యాఖ్యలను పొన్నం ప్రభాకర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఆ వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించేలా చంద్రబాబు చొరవ తీసుకోవాలని, ఈ మేరకు స్పీకర్‌కు లేఖ రాయాలని కోరారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న చంద్రబాబు, తన మిత్రపక్ష నేతలకు సర్దిచెప్పి ఇలాంటి సున్నితమైన అంశాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చూడాలని అన్నారు.రాష్ట్రం విడిపోయి దశాబ్ద కాలం గడిచినా, ఇంకా పాత గాయాలను రేపేలా మాట్లాడటం వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని మంత్రి స్పష్టం చేశారు. రెండు రా(ష్ట్రాలు పాత విభేదాలను పక్కనపెట్టి, పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో సాగడం తక్షణ అవసరం అని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. చంద్రబాబు తన వినతిని అర్థం చేసుకుని, సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు.



## అప్పుడు బీఆర్ఎస్‌కు.. ఇప్పుడు కాంగ్రెస్‌కు ఏటీఎంలా కాళేశ్వరం

హైదరాబాద్ (మెట్రోన్యూస్): సీఎం రేవంత్ రెడ్డి తీరుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో సీఎం మాట మారుస్తున్నారని ఆరోపించారు.గతంలో ఈ ప్రాజెక్టు ఎందుకూ పనికిరాదని, గోదావరిలోకొట్టుకు పోయిందని విమర్శించిన రేవంత్...ఇప్పుడు దానిపై ద్వంద్వవైఖరి అవలంబిస్తున్నారని మండిపడ్డారు.

తెలంగాణ ప్రభుత్వం
సదరన్ పవర్ డి(స్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్, సెంట్రల్ సర్కిల్, గ్రేటర్ హైదరాబాద్.
హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ కు సంబంధించిన టెండర్ నోటీసు నెం.01/2026/-27 కు సవరణ.

దెక్కన్ క్రానికల్, మెట్రో ఈవినింగ్‌లో 18.04.2026న ప్రచురించబడిన టెండర్ నోటీసు నెం.01/2026-27లోని ప్రకటనకు సంబంధించి, ఏకరీతి సర్వీస్ లైన్ ఛార్జీల క్రింద సేవలను విడుదల చేయడానికి పనుల పొడిగింపునకు సంబంధించిన క్రమ సంఖ్య 2, ఈ క్రింది విధంగా సవరించబడిందని దయచేసి గమనించగలరు.
టి.ఎస్. నెం. 01 (ఎస్సీ), 02, (జనరల్), 03 (ఎస్టీ), 04 (జనరల్). 05 (వడ్డెర/సాగర), 06, (జనరల్), 07 (ఎస్సీ), 08 (జనరల్) 09 (జనరల్) 2026-27 అన్ని సబ్-డివిజన్లలో ఏకరీతి సర్వీస్ లైన్ ఛార్జీల కింద సేవలను విడుదల చేయడానికి పనుల పొడిగింపు. పైన పేర్కొన్న నోటిఫికేషన్‌లోని మిగిలిన అన్ని నిబంధనలు మరియు షరతులు యథాతథంగా ఉంటాయి. పూర్తి సమాచారాన్ని www.tgsouthernpower.com నుండి లేదా దిగువ సంతకం చేసిన వారి ఫోన్: 8712469845 ద్వారా పొందవచ్చు.
సం/-
సూపరింటెండింగ్ ఇంజనీర్.
ఆపరేషన్,సెంట్రల్ సర్కిల్.హైదరాబాద్.
RO.No.1107-PP/CL/ADVT/1/2025-26 తేది:21.04.2026

# అతివాదుల చేతుల్లోకి ఇరాన్.. కలవరపడుతున్న ప్రపంచం.. !

పశ్చిమాసియా రాజకీయాల్లో పెను మార్పు రాబోతోంది. ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ అనారోగ్యంతో ఉన్నారన్న వార్తల నేపథ్యంలో దేశ పగ్గాలు 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్'లోని అతివాద నాయకుల చేతుల్లోకి వెళ్లడం ప్రపంచ దేశాలను కలవరపెడుతోంది. దౌత్యానికి బదులు సైనిక బల ప్రదర్శనకే మొగ్గు చూపే నాయకులు అధికారంలోకి రావడం యుద్ధం తీవ్రతను పెంచే సూచనగా కనిపిస్తోంది. ఐఆర్‌జీసీ గుప్పిట్లోకి.. ఇరాన్ అంతర్గత రాజకీయాల్లో ఊహించని పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయి. సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ యుద్ధంలో గాయపడి చికిత్స పొందుతున్న తరుణంలో, దేశ నాయకత్వ బాధ్యతలు 'మితవాద' నేతల నుంచి 'అతివాద' సైనిక అధికారుల చేతుల్లోకి వెళుతున్నాయి. ఐఆర్‌జీసీ మేజర్ జనరల్ అహ్మద్ వహిద్, అతని సన్నిహితులు ఇప్పుడు ఇరాన్ విదేశాంగ విధానాన్ని, సైనిక వ్యూహాలను శాసిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మార్పు కేవలం ఇరాన్ కే పరిమితం కాకుండా, ప్రపంచ ఇంధన రవాణా, భద్రతపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. దౌత్యానికి స్వస్తి? ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వంటి మితవాద నేతలు శాంతి చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని భావించారు. ముఖ్యంగా అమెరికాతో ఉద్రిక్తతలు తగ్గించేందుకు హార్మూజ్ జలసంధిని తెరవడానికి అరాగ్చీ అంగీకరించారు. అయితే, దేశ భద్రత, ఆర్థిక ప్రయోజనాల విషయంలో కఠినంగా ఉండాలని భావించే ఐఆర్‌జీసీ నాయకత్వం అరాగ్చీ ప్రతిపాదనలను తిరస్కరించింది. అహ్మద్ వహిద్ ఆధ్వర్యంలోని బృందం ఇప్పుడు దౌత్యవేత్తలను పక్కనపెట్టి, నేరుగా నిర్ణయాలు తీసుకుంటోంది. దీనివల్ల ఇరాన్ తన విదేశీ విధానంలో మరింత దూకుడు ప్రదర్శించే అవకాశం ఉంది. హార్మూజ్ దిగ్బంధనం.. అమెరికా ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని విధించిన నేపథ్యంలో, ఐఆర్‌జీసీ దానికి ప్రతి చర్యగా హార్మూజ్ జలసంధిని మూసి ఉంచాలని నిర్ణయించింది. వాషింగ్టన్‌లోని ఇనిస్టిట్యూట్


కృషితోనాస్తి దుర్భిక్షం

మెట్రో ఈవినింగ్స్

4, హైదరాబాద్ బుధవారం ఏప్రిల్ 22, 2026


## //ఎడిటోరియల్//

ఫర్ ద స్టడీ ఆఫ్ వార్ అంచనా ప్రకారం.. అమెరికా తన ఆంక్షలను ఎత్తివేసే వరకు ప్రపంచ చమురు రవాణాను స్తంభింపజేయడమే ఐఆర్‌జీసీ లక్ష్యం. సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మహమ్మద్ బఘెర్ నుంచి అహ్మద్ వహిద్‌కు మద్దతు లభించడం, అధికారికంగా సైన్యం పట్టు పెరగడానికి దోహదపడింద్. కరడుగట్టిన సైనిక నాయకుడు అహ్మద్ వహిద్ అహ్మద్ వహిద్ కేవలం సైనిక అధికారి మాత్రమే కాదు.. ఆయన కరడుగట్టిన అతివాద సిద్ధాంతకర్త. గతంలో ఇరాన్ అంతర్గత మంత్రిగా కూడా పనిచేశారు. ఇరాన్ క్షిపణి దళాలు, డ్రోన్ వ్యవస్థలపై ఐఆర్‌జీసీకి ఉన్న పట్టు ఇప్పుడు దేశ పాలనలో కూడా ప్రతిబింబిస్తోంది. దౌత్యం కంటే యుద్ధానికే మొగ్గు చూపే ఇలాంటి నాయకుల చేతుల్లోకి అధికారం వెళ్లడం వల్ల, అమెరికా, ఇజ్రాయెల్‌తో ప్రత్యక్ష యుద్ధం జరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రపంచ దేశాలపై ప్రభావం ఇరాన్‌లో ఈ అధికార మార్పు ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. హార్మూజ్ జలసంధిని మూసి ఉంచడం వల్ల ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకే అవకాశం ఉంది. ఇది భారత్ వంటి దేశాల ఆర్థిక వ్యవస్థలపై భారాన్ని పెంచుతుంది. ఇరాన్‌లో మితవాదులు బలహీనపడడం వల్ల, అణు ఒప్పందాలు లేదా శాంతి చర్చల ప్రక్రియకు దాదాపు ముగింపు పడినట్లే కనిపిస్తోంది. సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆరోగ్య పరిస్థితిపై స్పష్టత లేకపోవడం, మరోవైపు ఐఆర్‌జీసీ పట్టు పెంచుకోవడం ఇరాన్‌ను ఒక సైనిక పాలన వైపు నడిపిస్తోంది. 'అమెరికా బెదిరింపులకు లొంగిపోయేది లేదు' అనే నినాదంతో అతివాదులు తీసుకునే నిర్ణయాలు ఇరాన్ ప్రజల జీవితాలను, ప్రపంచ శాంతిని ఏ మలుపు తిప్పుతాయో వేచి చూడాలి. పశ్చిమాసియాలో శాంతి అనేది ఇప్పుడు దౌత్యవేత్తల చేతుల్లో లేదు, సైనిక కమాండర్ల తుపాకీ గొట్టాల ద్వారా నిర్ణయించబడబోతోంది.

## వృద్ధుడి వ్యధ

రాత్రి గాఢ నిద్రే రానే రాదు..
పగలేమో అసలే గడవదు..
కాలం ఆడుతున్న కపట నాటకాలు
మూలకు పడిన పురాతన దేహాలు
మానని లోతైన మొండి గాయాలు
కన్న పిల్లల నిర్లక్ష్య నిరాదరణలు !
ఎవ్వరికీ అక్కరలేని అనుభవాలు
పొర కమ్మిన మసకబారిన నేత్రాలు
అలసి సొలసిన గుండెల లబ్ డబ్‌లు
మది నిండా బహు వ్యథల మూటలు
సంతోషాన్ని దొంగిలిస్తున్న అనారోగ్యాలు
సృష్టి ప్రదాత రచించిన పోరు బాటలు !
అంతటా నిశ్శబ్దం ఆవహించి..
తడబడుతున్న అడుగులు
తత్తర పాటు నోటి మాటలు
మంటగలిసిన ఆనంద క్షణాలు
మొరాయిస్తున్న శరీర అవయవాలు
ససేమిరా అంటున్న ఉచ్ఛ్వాసనిశ్వాసాలు !
ఎంత పని చేశావు దేవుడా..
ప్రతి గడియ బతికి చస్తున్నా..
హృదయానికి గాయాలు చేసి..
గాల్లో దీపంగా మార్చేసి
కొస ప్రాణాన్ని నిలిపేసి..
జీవితాన్ని దోచావు దయలేని దేవుడా !
సుదీర్ఘ శతాబ్ద జీవితానికి..
ముగింపుగా చావును ఇవ్వు
ప్రాణదాతైన భగవంతుడా..
ప్రాణ గ్రహీతగా మోన్ని ఇవ్వు..
ఇప్పుడే తీసుకెళ్లు నీ దరికి..
ఓ మై గాడ్.. ఓ మై ఫ్రెండ్ !

-మధుపాళీ, 9949700037

# టీ ఘుమఘుమలతో తెలవారుతున్న పెల్లెలు,పట్నాలు

## మెట్రో తెలంగాణ చావడి






ప్రపంచవ్యాప్తంగా చాయ్ ప్రియులకు కొదవలేదు. చాలా మందికి తేనీరు పడందే రోజు గడవదు. తెల్లవారక ముందే టీ సుగంధం ఊరు వాడల్లో కవాతులు చేస్తున్నది. అతిథి మర్యాదలకు టీ ఒక సర్వసాధారణ పానీయం. వేడి వేడి తేనీరు లేదా టీ రుచి తగలందే దినం ప్రారంభం కాదు. ధనిక, పేద భేదం లేకుండా అందరి అమృత పానీయం చాయ్. తేయాకును నీటిలో మరిగించి కషాయంగా మార్చి చక్కెర కలిపితే గరం గరం చాయ్ రుచులు గుప్పున వ్యాపిస్తాయి, మెదడు ఉత్తేజితం అవుతూ,నాసికాపుటాలు చైతన్యం అవుతాయి. రోజుకు పదుల సంఖ్యలో టీ తాగే జనులు ఉన్నారు. ఒకరి ఏకాగ్రతను పెంచడానికి, ఒకరి నిద్ర మబ్బును తరమడానికి, ఒకరిలో శక్తిని నింపడానికి, మరొకరికి నిద్రకు ఉపక్రమించడానికి తేనీరు ఉపయోగపడుతున్నది. తేనీరు మన జీవన విధానంలో ఒక అవిభాజ్య భాగం అయ్యింది.చాయ్ అలవాటు లేని వారు అతి తక్కువ. తేనీరు ప్రాధాన్యాన్ని అవగాహన చేసుకునేందుకు ప్రతి ఏటా 21 ఏప్రిల్ రోజున క్వీన్ ఎలిజబెత్ జన్మదినం సందర్భంగా "జాతీయ తేనీరు దినోత్సవం (నేషనల్ టీ డే)" పాటించుట 2016 నుంచి ఆనవాయితీగా మారింది. 2026 జాతీయ టీ దినోత్సవ ఇతివృత్తంగా "అధికంగా మరుగబెట్టడం – అధికంగా వాడడం (బ్రివ్ మోర్, డూ మోర్)" అనే అంశాన్ని తీసుకున్నారు. నినిప్రపంచ టీ చరిత్ర: భారతదేశానికి టీని పరిచయం చేసిన ఘనత 'రాబర్ట్ ఫార్చ్యూన్'కు దక్కుతుంది. భారతీయుల




జీవనశైలిలో సహితం ఒక భాగమైన చాయ్ పానీయం బలహీనతగా కూడా మారిపోయింది. తేన్చుకున్నా చైనా మాండరిన్ భాషలో 'చా' అంటారు. అలాగే పార్టీలో 'చాయే' అని అంటారు. వీటి నుంచే 'చాయ్' అనే పదం వచ్చి ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు. అరాబిక్‌లో 'షా' అని, రష్యన్ భాషలో 'చాయే' అని, స్వాహిలిలో 'చాయ్' అని పిలుస్తారు. పలు ప్రాంతాల్లో 'టీ' అని పిలుస్తారు. టీ తాగడం ఒక అలవాటుగా కూడా మారకపోవడం చూస్తున్నాం. 'కామెల్లియా సినెన్సిస్' అనే పేరుగల చెట్టు ఆకులను ఎండబెట్టి పొడి చేసి నీటిలో వేసి మరిగిస్తే గరం గరం సుగంధ పానీయం 'చాయ్' తయారు అవుతుంది. క్రీ పూ 59లో చైనాలో నమోదు అయిన టీ పానీయం వేగంగా ప్రపంచంలో విస్తరించింది. చైనా వైద్యుడు 'హుడా టువో' తొలిసారి తన రచనలో టీ ప్రస్తావన తీసుకువచ్చారు. 16వ శతాబ్దంలో పోర్చుగీస్‌లో, 17వ శతాబ్దంలో బ్రిటీష్‌లో టీ తాగడం ఒక ఫ్యాషన్ అయ్యింది. తర్వాత బ్రిటీస్ వలస పాలనలో భారత్‌లోకి టీ ప్రవేశించడం, ప్రజలకు అలవాటుగా మారడం జరిగింది. నినిభారత్‌లో టీ రకాలు: రసాయన పరంగా టీ పొడిలో దాదాపు 3 శాతం కెఫీన్ ఉంటుంది. కెఫీన్‌తో పాటు టీలో పాలిఫినాల్స్, థియోబ్రోమిన్, థియోఫిలిన్ అనే క్లాంథైన్, ఉత్ప్రేరకాలు తక్కువ పరిమాణంలో ఉంటాయి. టీలో ఉన్న కెఫీన్ రసాయనం వల్ల చురుకుదనం పెరగడం జరుగుతుంది. తేనీరు పలు రకాలుగా ఉంటుంది. వీటిలో బ్లాక్, గ్రీన్, ఓలాంగ్, వైట, డార్క్, యెల్లో టీలు అతి ముఖ్యమైనవి. ప్రాంతీయంగా మట్కా, మసాలా, బెల్లం, ఎర్ల్ గ్రే, హర్బల్, పుయర్, ఫ్లేవర్డ్ టీ లాంటివని కూడా ఉంటాయి. సామరస్యం, గౌరవం, స్వచ్ఛత, ప్రశాంతత అనే నాలుగు సూత్రాల మీద ఆధారపడి ఉంటుంది. నినిటీ క్యాపిటల్ ఆఫ్ ఇండియా – అస్సాం: డిబ్రుగఢ్‌ను "భారత టీ నగరం"గా, అస్సాంను "భారతదేశ టీ కేపిటల్"గా వ్యవహరిస్తారు. మొదట చేదుగా, తర్వాత తీపిగా. అంతిమంగా నోటిలో చాలా సేపు నిలిచిపోయే రుచిని టీ అందిస్తుంది.

భారత్‌లో తొలిసారి 1839లో అస్సాం టీ కంపెనీ ప్రారంభం అయ్యింది. భారత్‌లో అత్యధికంగా అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, కర్నాటక లాంటి రాష్ట్రాలు టీ ఉత్పత్తిలో ముందున్నారు. మన వంటింటి అత్యవసర పానీయంగా టీ పేరు అత్యంత ప్రజాదరణ పొందింది.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

## మెట్రో ఇలవేల్పు

# తమిళనాట వెలసిన ఆరు సుబ్రహ్మణ్య క్షేత్రాలు





శివుని కుమారుడైన సుబ్రహ్మణ్య స్వామికి సంబంధించిన ఆరు ప్రధాన క్షేత్రాలు.

శివుని కుమారునిగా పూజలందుకునే సుబ్రహ్మణ్యస్వామికి ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత ఉంది. తండ్రికే జ్ఞానబోధ చేసిన కుమారునిగా సుబ్రమణ్యస్వామి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. ఆరు ముఖాలతో కూడిన షణ్ముఖ స్వామిగా నిత్యం భక్తుల చేత పూజలందుకునే సుబ్రమణ్యేశ్వరునికి తమిళనాడులోనే అనేక ఆలయాలు అధికంగా ఉండడం విశేషం. సాధారణంగా సుబ్రహ్మణ్య స్వామి కుజగ్రహానికి అధిపతి. అందుకే ఈ స్వామి వెలసిన ఈ ఆరు క్షేత్రాలు దర్శించడం వల్ల కుజ గ్రహదోషం పరిహారమవుతుందని విశ్వాసం. తమిళనాడులో వెలసిన ఈ సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రాలు ఎక్కడెక్కడ ఉన్నాయి? వాటి విశేషాలేమిటో ఈ కథనంలో తెలుసుకుందాం.

### తమిళుల ఆరాధ్య దైవం

ఆంధ్రప్రదేశ్ లో శైవ, వైష్ణవ క్షేత్రాలు అధికంగా ఉన్నట్టుగానే తమిళనాడులో సుబ్రమణ్యేశ్వరుని ఆలయాలు ఎక్కువ సంఖ్యలో కొలువై ఉన్నాయి. ఆరుముఖాల స్వామిగా తమిళులకు ప్రీతిపాత్రమైన సుబ్రమణ్యేశ్వరుని స్వామికి స్వయంభువుగా వెలసిన ఆరు దివ్య ఆలయాలన్నీ కూడా తమిళనాడులోనే ఉండడం విశేషం. సుబ్రమణ్యేశ్వరుని దివ్య రూపాలను దర్శించాలనుకునే వారు ఈ ఆరు క్షేత్రాలను దర్శిస్తే సరిపోతుంది.

### తిరుపరంకుంద్రం

తిరుప్పరంకుంద్రం తమిళనాడులోని మదురై సమీపంలో ఉన్న ఒక ప్రసిద్ధ సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రం. ఈ క్షేత్రం మురుగన్ ఆరు పవిత్ర క్షేత్రాలలో మొదటిదిగా భాసిల్లుతోంది. ఇక్కడ సుబ్రహ్మణ్య స్వామి దేవసేనను వివాహం చేసుకున్నారు. అంతేకాకుండా, ఇక్కడి ఆలయంలో స్వామి వారు కూర్చున్న భంగిమలో దర్శనమిస్తారు. ఈ క్షేత్రంలో స్వామిని దర్శిస్తే తప్పకుండా కళ్యాణ యోగం కలుగుతుందని విశ్వాసం.

### తిరుచందూర్

తమిళనాడులోని తూత్తుకుడి జిల్లాలో సముద్ర తీరాన వెలసిన అతి ప్రాచీన, ప్రసిద్ధ క్షేత్రం తిరుచందూర్! ఈ క్షేత్రం మురుగన్ ఆరు ప్రధాన క్షేత్రాలలో రెండవ క్షేత్రంగా భాసిల్లుతోంది. ఈ క్షేత్రంలో సుబ్రమణ్యేశ్వర స్వామి స్వయంభువుగా వెలసి ఉన్నాడు. సూరపద్ముడు అనే రాక్షస రాజును సంహరించేందుకోసం స్వామివారు ఈ తిరుచందూర్ లో వెలిశారం!

### తిరుచందూర్

లోని సుబ్రహ్మణ్య స్వామి వారి విగ్రహం కూర్చుని ఉన్నట్టు ఉండడం ఆశ్చర్యకరం. ఈ క్షేత్ర దర్శనం వల్ల అవివాహితులకు వివాహం, సంతానం లేని వారికి సంతాన భాగ్యం కలుగుతుందని విశ్వాసం.

### పళని

తమిళనాడులోని దిండిగల్ జిల్లాలో ఉన్న పళని సుప్రసిద్ధ సుబ్రహ్మణ్యుని పుణ్యక్షేత్రం. ఈ క్షేత్రం మురుగన్ ఆరు ప్రధాన క్షేత్రాలలో మూడవదిగా భాసిల్లుతోంది. ఆంధ్రప్రదేశ్ లోని తిరుమల క్షేత్రానికి ఎంతటి ప్రసిద్ధి వుందో తమిళనాడులో పళవి క్షేత్రానికి అంతటి ప్రసిద్ధి ఉంది. తిరుమల తరహాలోనే పళవి క్షేత్రంలో కూడా నిత్యం భక్తులు కిటకిటలాడుతుంటారు. ఈ క్షేత్రంలో సుబ్రహ్మణ్యుడు దండాయుధపాణిగా వెలసి ఉన్నాడు. కొండపై వెలసిన స్వామివారిని









దర్శించుకోవాలంటే దాదాపు వెయ్యి మెట్లు ఎక్కాల్సి ఉంటుంది. పళని క్షేత్రంలో నవపాషాణాలతో తయారు చేయబడిన మురుగన్ విగ్రహానికి ప్రత్యేక వైద్య గుణాలు ఉన్నాయని ప్రతీతి. అందుకే ఈ స్వామి దర్శనంతో చికిత్సలకు లొంగని మొండి రోగాలు సైతం నయమవుతాయని విశ్వాసం.

### స్వామి మలై

స్వామిమలై స్వామినాథ స్వామి ఆలయం తమిళనాడులోని కుంభకోణం సమీపంలో వెలసిన కుమారస్వామి ఆరు పవిత్ర క్షేత్రాలలో నాలుగవది. స్వామి మలై అని పిలిచే ఈ క్షేత్రంకు అత్యంత విశిష్టత ఉంది. తన తండ్రి అయిన పరమశివునికి సుబ్రమణ్యస్వామి జ్ఞానోపదేశం చేసిన ప్రదేశంగా ఈ స్వామిమలైని పేర్కొంటారు. ఇక్కడ సుబ్రహ్మణ్యుడు స్వామి నాథునిగా పూజలందుకుంటున్నాడు. ఈ క్షేత్రాన్ని సందర్శిస్తే జ్ఞానసిద్ధి కలుగుతుందని విశ్వాసం.

### తిరుత్తణి

తిరుత్తణి తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాలో, తిరుపతి నుంచి దాదాపు 60 కిలోమీటర్ల దూరంలో వెలసిన ప్రసిద్ధ సుబ్రహ్మణ్యుని పుణ్యక్షేత్రం. ఈ క్షేత్రం మురుగన్ ఆరు ప్రధాన క్షేత్రాలలో ఐదవ క్షేత్రంగా భాసిల్లుతోంది. కుమారస్వామి తన దేవేరుల్లో ఒకరైన శ్రీవల్లిని తిరుత్తణిలోనే పరిణయం చేసుకున్నట్లుగా పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడ స్వామి వారిని ఐదు రోజులు హృదయపూర్వకంగా పూజిస్తే, జీవితంలో గొప్ప శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.

# జనగణన సమర్థవంతంగా నిర్వహించాలి.



**జనగణనలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఉండకూడదు.**

**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్.**



నాగర్ కర్నూల్ బ్యూరో:----(మెట్రో న్యూస్:ఏప్రిల్ 21)ఎన్యుమరేటర్లు,సూపర్వైజర్లు జనగణను సమర్థవంతంగా నిర్వహించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు.అచ్చంపేట మండల కేంద్రంలోని ఎం, ఎస్, ఎన్ హైస్కూల్లో జరుగుతున్న జనగణన శిక్షణ తరగతులను వివరాలను మంగళవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో కాగితంపై జనగణన వివరాల రాసేవారని, ప్రస్తుతం 2027 జనగణన కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్లో డిజిటల్ సర్వే జరుగుతుందని, ఇండ్లు, జనగణన జాగ్రత్తగా చేయాలన్నారు.డిజిటల్ సర్వే చేసేటప్పుడు ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు యాప్లో పొరపాటున తప్పులు నమోదు చేసిన సరిచేసుకోవాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. ఎన్యుమరేటర్లు క్షేత్రస్థాయికి వెళ్లే ముందు తమకు అందజేసిన హౌస్ లిస్టింగ్ బ్లాక్ మ్యాప్ ఆధారంగా హద్దులను ముందస్తుగా తనిఖీ చేసుకోవాలని సూచించారు.ప్రతి ప్రశ్నకు సమాధానం నమోదు చేసి సర్వేను పకడ్బందీగా చేయాలని తెలిపారు.శిక్షణ సందర్భంగా ఏవైనా అనుమానా ఉంటే క్లియర్ చేసుకోవాలని చెప్పారు.ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని,జిల్లా అభివృద్ధికి తోడ్పడే జనగణన పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపినారు.జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి,తాహసిల్దార్ సైదులు, మాస్టర్ ట్రైనర్లు,ఇతర అధికారులు తదితరులు ఉన్నారు

## గురుకులాల్లో సదుపాయాలపై శ్రద్ధ తీసుకోవాలి.

**నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్.**



మెట్రో న్యూస్ అచ్చంపేట (ఏప్రిల్ 21):గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, సదుపాయాల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక లో భాగంగా కొనసాగుతున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా మంగళవారం అచ్చంపేట పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, పాఠశాల ప్రాంగణాన్ని సమగ్రంగా పరిశీలించారు. వంటశాలలు, నిల్వ గదులు, తరగతి గదులు, వసతి గృహాల పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు పరిశుభ్రత కీలకమని, ప్రతి విభాగంలో శుభ్రతను నిరంతరం పాటించాలని ఆదేశించారు. ముఖ్యంగా వంటశాలలో ఆహారం తయారీ సమయంలో నాణ్యత ప్రమాణాలు, శుభ్రతపై ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, సరైన డైట్ ప్లాన్‌ను అమలు చేయాలని, ఆహార భద్రత విషయంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. నిల్వ గదుల్లో ధాన్యాలు, ఇతర ఆహార పదార్థాలను సురక్షితంగా నిల్వ చేయాలని, గడువు ముగిసిన పదార్థాలు వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులపై దృష్టి సారిస్తూ, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సంక్షేమ వారోత్సవాల భాగంగా నేడు నిర్వహిస్తున్న క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, తహసీల్దార్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధరూర్‌లో నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావ సభకు పిలుపు.



గద్వాల ఏప్రిల్ 21( మెట్రో న్యూస్)ధరూర్ మండల కేంద్రంలో నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావ సభకు సంబంధించిన గోడపత్రికలను ఎన్.హెచ్.పీ.ఎస్ మరియు తెలంగాణ జాగృతి నాయకులు మంగళవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవిందు మాట్లాడారు.ఈ నెల 25న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో జరగనున్న నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణలో బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం,అమరుల ఆశయ సాధన కోసం ఈ కొత్త రాజకీయ వేదిక ఏర్పడుతోందని తెలిపారు.రాబోయే రోజుల్లో తెలంగాణలో ఒక శక్తివంతమైన రాజకీయ శక్తిగా ఎదగబోయే ఈ పార్టీ ఆవిర్భావ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సమితి మరియు తెలంగాణ జాగృతి జిల్లా,మండల నాయకులు వెంకట్రాములు,అడివి ఆంజనేయులు,రాము,వెంకటేష్, సుదర్శన్,శాంతన్న,వీరన్న,కృష్ణ,మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి నా లక్ష్యం.

**రాజకీయాలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం.**

**ఆకు నెల్లికుదురు గ్రామ సర్పంచ్ బాల వెంకటయ్య.**



నాగర్ కర్నూల్ రూరల్:----( మెట్రో న్యూస్:ఏప్రిల్ 21)గ్రామ అభివృద్ధి నా లక్ష్యం అని గ్రామానికి రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామని దానికి గ్రామంలో ఉన్న యువత సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని ఆకు నెల్లికుదురు గ్రామ సర్పంచ్ బాల వెంకటయ్య అన్నారు నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండల పరిధిలోని ఆకునెల్లి కూతురు గ్రామంలో సోమవారము వాడాల శ్రీకాంత్ రావు చేతుల మీదగా నాలుగు ఐమాక్స్ లైట్లను ప్రారంభించారు మొదటగా కోట మైసమ్మ దగ్గర,రెండవది అంబేద్కర్ బొమ్మ దగ్గర,మూడవది గణేష్ మండపం దగ్గర,నాలుగోదిలో బీసీ కాలనీలో ప్రారంభించడం జరిగింది. ఇందులో భాగంగా సర్పంచ్ బాల వెంకటయ్య వార్డు మెంబర్లు ఆంజనేయులు అనిల్ రెడ్డి బాలకృష్ణ చైతన్య జయమ్మ,గ్రామ ముఖ్య నాయకులు కాశిరెడ్డి చంద్రమౌళి ఇంద్రారెడ్డి సత్యం రెడ్డి రాములు శ్రీనివాసులు దయాకర్ రెడ్డి శ్రీనివాసులు గౌడు వెంకటయ్య బాలస్వామి వెంకటయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

# లారీని ఢీకొన్న కారు ఘోర రోడ్డు ప్రమాదం

# తల్లి నాలుగు నెలల కొడుకు మృతి

**తండ్రి ప్రకాశ్ రెడ్డి కి తీవ్ర గాయాలు**

**తండ్రీ చికిత్స కోసం వనపర్తి ఆసుపత్రికి తరలింపు**



(మెట్రో న్యూస్) మహబూబ్నగర్ జిల్లా అడ్డాకుల మండల శివారులోని జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తల్లి కూతురు మృతి చెందగా తండ్రికి తీవ్ర గాయాలు అయ్యాయి. రోడ్డు ప్రక్కన అరటిపండ్ల లోడుతో ఆపి ఉన్న లారీనీ వెనక నుండి కారు ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి జిల్లా కంచిరావుపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్ రెడ్డి టీఎస్ 32 ఈ 6167 నెంబర్ గల కారులో కుటుంబంతో కలిసి దర్శనం కోసం యాదగిరిగుట్టకు వెళుతుండగా తెల్లవారుజామున వారి స్వగ్రామం నుండి బయలుదేరిన కారు సుమారు 6 గంటల సమయంలో కొత్తకోట దాటిన తర్వాత అడ్డాకుల శివారులోని హెచ్పి పెట్రోల్ బంక్ సమీపంలో యూపీ రాష్ట్రానికి చెందిన అరటిపండ్ల లోడుతో రోడ్డు పక్కన ఆగి ఉన్న టిఎన్ 52 ఎమ్ 1776 లారీని వెనుక నుంచి కారు ఢీ కొట్టింది దీంతో కారు లారీ వెనుక భాగం లో ఇరుక్క పోవటంతో కారులో ప్రయాణిస్తున్న ఒక కుటుంబానికి చెందిన నందిని (21) ఆమె 4 నెలల కుమారుడు కన్నయ్య అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ప్రకాశ్ రెడ్డి ని వెంటనే అత్యవసర చికిత్స కోసం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాద స్థలాన్ని పరిశీలించి ట్రాఫిక్ క్లియర్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ వివరాలు తెలిపారు. తల్లి కొడుకుల మృతదేహాలను మహబూబ్నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి తండ్రి మెరుగైన చికిత్స కోసం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తెల్లవారుజామున కావడం వలన ప్రమాదం జరిగి ఉంటుందని అంటున్నారు.

## సమ్మర్ ట్రైనింగ్ క్యాంప్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



మెట్రో న్యూస్ వనపర్తి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సమ్మర్ ట్రైనింగ్ క్యాంప్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మర్రికుంట ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో క్రికెట్, హాకీ సమ్మర్ ట్రైనింగ్ క్యాంప్ ప్రారంభించిన కలెక్టర్‌లి సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్విజ్, డ్రాయింగ్ పోటీలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు ఎంతగానో దోహదపడతాయని, అందుకే ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు టాలెంట్ ఫెస్ట్ నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ వనపర్తి మర్రి కుంటలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న హాకీ మరియు క్రికెట్ సమ్మర్ ట్రైనింగ్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సమ్మర్ ట్రైనింగ్ క్యాంప్ ఈరోజు నుండి ప్రారంభమై ఏప్రిల్ 29 వరకు కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. తదుపరి కలెక్టర్ పాఠశాల వంటగదిని పరిశీలించారు. వంటగది పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థులకు మంచి ఆహారం అందించాలన్నారు. అలాగే సంక్షేమ వారోత్సవాల భాగంగా పాఠశాలలో నిర్వహిస్తున్న క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి, సరైన సమాధానాలు చెప్పిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రమేష్ రెడ్డి, ప్రిన్సిపల్ సరస్వతి, పాఠశాల సిబ్బంది, అధికారులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్.**



నాగర్ కర్నూల్ బ్యూరో:---( మెట్రో న్యూస్ ఏప్రిల్ 21), నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట కు సంబంధించిన దేవదారికుంట తండా వద్ద ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి,కేంద్రంలో జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను సమగ్రంగా సమీక్షించిన జిల్లా కలెక్టర్,అక్కడికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కొనుగోలు ప్రక్రియలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ రైతులకు కోరారు.ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై స్పందించిన జిల్లా కలెక్టర్, కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ముఖ్యంగా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర 2400 రూపాయలు రైతులకు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ సూచించారు.తేమ శాతం 14 శాతం లోపు ఉండే విధంగా పంటను సిద్ధం చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు.తేమ శాతం అధికంగా ఉంటే ధర తగ్గే అవకాశాలు ఉన్నందున, ఈ విషయంలో జాగ్రత్తలు పాటించాలని,మొక్కజొన్న నాణ్యతపై కూడా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు, అలాగే కేంద్రంలో తూకం, నిల్వ, రవాణా వంటి ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని కొనుగోలు కేంద్రం వద్ద తాగునీరు,నీడ,కూర్చునే సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, తహసీల్దార్ సైదులు,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సీఈఓ కొమ్ము ఎల్లయ్య,ఆర్ఐ బలరాం,శివ,పీఏసీఎస్ మల్లేష్, రైతులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పాలమూరు కార్పొరేషన్ 41వ డివిజన్‌లో వార్డ్ సభ - పథకాల అమలుపై దృష్టి



మెట్రో న్యూస్ మహబూబ్ నగర్ టౌన్‌పాలమూరు కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్ సద్దలగుండులో మంగళవారం వార్డ్ సభ నిర్వహించారు. కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత ఈ డివిజన్‌లో నిర్వహించిన మొదటి వార్డ్ సభగా ఇది ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా మూడా చైర్మన్ మరియు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు కేవలం కాగితాలపై కాకుండా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రధాన ఉద్దేశమని తెలిపారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా అమలు చేస్తున్న ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే, ఈ కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టారు. 99 రోజుల ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంఈ మురళి మోహన్ రెడ్డి, వార్డ్ ఆఫీసర్ సతీష్, ఆర్పీలు, సరిత రెడ్డి, హబీబా, విజయలక్ష్మి, మున్నూరు రవి, డీసీసీ కార్యదర్శి రాజు మామ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఉషారాణి, క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు సామ్యూల్ దాసరి, శ్యామ్, సతీష్ కుమార్, సాయిలు యాదవ్, శ్రీనివాస్ చారి, ఖదీర్, శేఖర్, రాము, షబ్బీర్, దినేష్, చింటూ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## బాటసారిల సేద తీరుస్తున్న శైలేందర్ సింగ్



ఆత్మకూర్ మండలం మెట్రో న్యూస్ అమరచింత మండల కేంద్రం లో చిన్న కడుమూర్ పోయే రహదారిలో శైలేందర్ తోట దగ్గర శైలేందర్ సింగ్ లలిత రామ్ సింగ్ సౌజన్య సహాయంతో అంబలి కేంద్రం ఏర్పాటు చేసి దానితోపాటు త్రాగునీరు ఏర్పాటు చేయడం జరిగింది ప్రతిరోజు 100 లీటర్ల రాగి అంబలి ని తయారుచేసి బాటసారిలకు ప్రతిరోజు పేద తీరుస్తున్నారు శైలేందర్ సింగ్ సొంత నిధులు నాలుగు లేదా ఐదు వేలు రూపాయల పెట్టుబడితో ఖర్చుచేసి ఎండాకాలంలో ప్రజల కు సేద తీర్చడం అంటే సామాన్య విషయం కాదు ఎందరో ఎన్ని డబ్బులు ఉన్నా ఒక్క రూపాయ ఖర్చు కూడా చేయరు రోజుకు ఐదువేల రూపాయలు ఖర్చు చేస్తూ ప్రజా సేవ చేస్తున్న శైలేందర్ సింగ్ ఎంతో గొప్ప మనసు గలవారని ప్రజలు భావిస్తున్నారు దానిలో భాగంగా ఒక్కొక్క రోజు మామిడి పచ్చడి చింతకాయ పచ్చడి కూడా అందిస్తున్నారు మానవసేవే మాధవ సేవ అన్నారు పెద్దలు ఇలాంటివారు నూటికి ఒకరు ఉంటే చాలు అని అంటారు పెద్దలు

## గ్రామపంచాయతీలలో సమాచార హక్కు చట్టం-2005 బోర్డులు ఏర్పాటు చేయాలి

వంగూరు,మెట్రో న్యూస్ ఏప్రిల్ 21,నాగర్ కర్నూలు జిల్లా వంగూరు మండలం లో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలలో సమాచార హక్కు చట్టం- 2005 బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో ఆఫీసులో సూపరిండెంట్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఆర్టిఐ బోర్డు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు సమాచార హక్కు చట్టం- 2005 పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు గ్రామ పంచాయతీలలో ఆర్టిఐ దరఖాస్తులు ఎవరికి ఇవ్వాలి మరియు ఎవరికి ఫస్ట్ అప్పీలు చేసుకోవాలి తెలియక చాలా ఇబ్బందులు అవుతున్నాయని గుమ్మకొండ శివరాజు ఎన్నమల్ల అనంతరాములు తెలిపారు.

## జె ఈ ఈ మెయిన్స్ ఫలితాలలో కే ఎల్ ఎన్ కళాశాల విద్యార్థుల జయకేతనం.



మిర్యాలగూడ, మెట్రో న్యూస్.నేడు వెలువడిన ఈ ఈ మెయిన్స్ 2026 ఫలితాల్లో కే ఎల్ ఎన్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ ఆల్ ఇండియా 351 ర్యాంక్ ను కే .చరణ్ సాధించి టాప్ నిట్ లో సీటు సాధించే ర్యాంక్ సాధించటం గర్వకారణమన్నారు.అదే విధంగా కే .శివ చరణ్ 7577 ర్యాంక్ ఇంకా అడ్వాన్స్ కి సెలెక్ట్ అయిన వారు సి హెచ్ .మౌనిక,ఎస్కె అస్మా ,బి .చాణక్య ,పి .శ్రీవల్లి, ఎన్ .మనస్విని ,ఎల్ .హేమలత సాధించారు.ఇరువై సంవత్సరాలగా వరుస విజయాలు సాధిస్తున్న ఏకైక కళాశాల కే ఎల్ ఎన్ జూనియర్ కాలేజీ అని రాబోయే రోజుల్లో కూడా అత్యుత్తమ ర్యాంక్ లు సాధిస్తామని ప్రణాళిక తో విద్య బోధన చేస్తున్నామని కరెస్పాండంట్ కిరణ్ కుమార్ డైరెక్టర్స్ టీ .నరేందర్ రెడ్డి పి ఎల్ ఎన్ రెడ్డి , హనుమంత రెడ్డి ,బి .చైతన్య ఆనంద్ తెలిపారు

### క్యాన్సర్ రక్కసిపై ముందస్తు వేటు:

### కేజీబీవీ బాలికలకు 'రక్షణ' టీకా

మెట్రో న్యూస్ ఏప్రిల్ 21(గరిడేపల్లి)స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం విద్యార్థినులకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ టీకాలను వేశారు. 14 ఏళ్ల వయసు కలిగిన 18 మంది విద్యార్థినులకు ఈ టీకాలు అందించారు.ఈ సందర్భంగా వైద్యులు నరేష్ మాట్లాడుతూ.. మహిళలు భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే ఈ టీకా ఎంతో అవసరమని వివరించారు. చిన్న వయసులోనే దీనిని తీసుకోవడం వల్ల ఆ ప్రాణాంతక వ్యాధి నుండి పూర్తిస్థాయిలో రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన

# ధాన్యం కొనుగోళ్లను పెంచాలి.

**అన్ని కేంద్రాలకు అవసరమైన లారీలను సిద్ధం చేయాలి.**

**ధాన్యం కొనుగోలను 24 గంటలు నిర్వహించాలి.**

**అధిక దిగుబడి గల గ్రామాలను గుర్తించాలి.**

**ఇందిరా భవన్ లో జిల్లా కలెక్టర్ ,అధికారులతో రబీ ధాన్యం సేకరణ పై సమీక్ష**

**రాష్ట్ర మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి.**



నల్గొండ బ్యూరో, మెట్రో న్యూస్ యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్ల ను పెంచాలని రాష్ట్ర మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో జిల్లా కలెక్టర్ ,అధికారులతో రబీ ధాన్యం సేకరణ పై నిర్వహించిన సమీక్ష లో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాలకు అవసరమైన లారీలను సిద్ధం చేయాలని,ధాన్యం కొనుగోలను 24 గంటలు నిర్వహించాలని సూచించారు.అధిక దిగుబడి గల గ్రామాలను గుర్తించాలని అన్నారు.రైతులు ,కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు తాగు నీరు,నీడ ఖచ్చితంగా ఉండాలి. రైతులు విక్రయాలకు తరలించిన ధాన్యాన్ని రాత్రి ,పగలు లైట్లు ఏర్పాటు చేసి ధాన్యం కొని మిల్లుల కు పంపాలని ఆదేశించారు.

రోడ్లపై ధాన్యం పోయకుండా అవసరమైతే పాఠశాలలు,ఫంక్షన్ హాల్స్ వద్ద కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయండి. నల్గొండ నియోజక వర్గంలో 2 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్,అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,వై.అశోక్ రెడ్డి,పౌర సరఫరాల,వ్యవసాయ,మార్కెటింగ్,డి ఆర్ డి ఏ , డి ఓ,రవాణా అధికారులు, రైస్ మిల్లర్లు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి లు పాల్గొన్నారు.

# వేసవిలో ప్రజల దాహార్తీ ని తీర్చడం గొప్ప విషయం.

**జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్.**

మిర్యాలగూడ, మెట్రో న్యూస్.వేసవిలో ప్రజల దాహార్తీ ని తీర్చడం గొప్ప విషయమని .జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ అన్నారు.మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పట్టణ కేంద్రం లో ఏర్పాటు చేసిన పెరుగన్నం, చలివేంద్రాలు ఏర్పాటు చేసి తొమ్మిదవ రోజు పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ మాలెంపాటి లతో కలసి ప్రారంభించిన అనంతరం అయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా, నియోజకవర్గ ప్రజల, బాటసారుల సౌకర్యార్థం ఇలాంటి సేవా కార్యక్రమం గొప్పదన్నారు. కార్యక్రమంలో పాల్గొని పెరుగన్నం పంపిణీ



చేసి పెరుగన్నం తిన్నారు.ఈ కార్యక్రమం లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ చిలుకూరు సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్,కౌన్సిలర్లు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచ్ లు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు బి ఎల్ ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెట్ ధరించాలి

### జిల్లా ఎస్పీ కె, నరసింహ

### హెల్మెట్ వినియోగం పై అవగాహన చేసిన వ్యక్తికి సన్మానం.



మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ఎస్పీ కె, నరసింహ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం సందర్భంగా రోడ్డు భద్రతపై వీడియో రూపొందించి రోడ్డు ప్రమాదాల నివారణ భాగస్వామ్యం కావాలని పోలీసు శాఖ ఇచ్చిన పిలుపు మేరకు సూర్యాపేట పట్టణం జమ్మిగడ్డకు చెందిన కిరాణా దుకాణం నిర్వాహకులు నాగరాజు హెల్మెట్ వినియోగం పై అవగాహన వీడియో రూపొందించారు. వీడియో రూపొందించిన నాగరాజును ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్పి అభినందించారు. ఈ అవగాహన వీడియో నందు నటించిన చిన్నారులు యశస్వి, వర్ష, సుశాంత్, రవి లకు మిఠాయిలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వీడియో నందు హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే ప్రమాదాన్ని చక్కగా వివరించారని, ప్రయాణ సమయంలో ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్పీ తెలిపారు.
ఈ కార్యక్రమం లో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### జనగణన అన్ని ప్రామాణికాలకు కీలకమైనది

### తహసీల్దార్ గుమ్మి రాజశేఖర్ రెడ్డి



మెట్రో న్యూస్, (ఏప్రిల్ 21)పెన్ పహాడ్: జనగణన అన్ని ప్రామాణికాలకు కీలకమైనదని పెన్ పహాడ్ తహసీల్దార్ గుమ్మి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జనగణన-2027 శిక్షణ తరగతులకు ఆయన మంగళవారం హాజరై మాట్లాడారు, దేశ భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనలో జనగణన అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు.మొదటి విడతలో భాగంగా శిక్షణ పొందుతున్న 40 మంది ఎన్యుమనేటర్లు, సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేయాలని ఆయన కోరారు. నిర్దేశించిన 34 అంశాలపై ప్రజల నుండి ఖచ్చితమైన వివరాలను సేకరించాలని, ఎక్కడా పొరపాట్లకు తావివ్వకూడదని సూచించారు. సమాచార సేకరణలో ఎదురయ్యే సందేహాలను శిక్షణ ద్వారా నివృత్తి చేసుకోవాలని తహసీల్దార్ తెలిపారు. అనంతరం సిబ్బంది ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న తీరును ఆయన పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ నవీన్, ట్రైనర్లు శ్రీనివాస్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ వసతి గృహాలలో సమస్యలపై నివేదికలు అందించాలి

**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**ఇమాంపేట కేజీవిబి స్కూల్ కు రూ.50వేలు విడుదల చేసిన కలెక్టర్.**




మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలపై సత్వరమే నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా సూర్యాపేటలోని కేజీవిబిని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మెస్ కమిటీలు సక్రమంగా రిజిస్టర్ మెంటెయిన్ చేయాలని, రోజు వారీగా స్టాక్ వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచడం జరిగిందని, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాలలో వసతి గృహాలలో నెలకొన్న సమస్యలతో పాటు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న వసతి గృహాలలో రిపేర్లను గుర్తించి నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.. రిపేర్ల కోసం నివేదికను అందించాలని తెలిపారు.గతంలో కంటే ప్రస్తుతం వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి పెట్టి రెగ్యులర్ గా మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో వసతి గృహాలలో నెలకొన్న చిన్న చిన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. వసతి గృహాలలో రెగ్యులర్ గా పేరెంట్స్, టీచర్ మీటింగ్ ఏర్పాటు చేసుకొని విద్యార్థుల సమస్యలపై చర్చించుకోవాలని సూచించారు.. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. అనంతరం వంట శాల, స్టోర్ గదులను, లివింగ్ రూమ్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.. విద్యార్థులకు అందిస్తున్న మెనూ పై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కేజీవిబిలో ఫ్యాన్లు, మైనర్ రిపేర్ల కోసం కలెక్టర్ అవైలబుల్ నిధుల నుండి రూ.50వేలు అందించారు. .కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, ఎస్.ఓ.నారాయణమ్మ, జిసిడిఓ పుల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**రైతులకు మౌలిక వసతులు కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: జిల్లాలో ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.. మంగళవారం కోదాడ మండలం తమ్మర బండపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందన్న అంచనా మేరకు జిల్లా వ్యాప్తంగా 340కి పైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 25వేల మెట్రిక్ టన్నుల పైగా ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, సోమవారం ఒక్కరోజే 8900 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు వివరించారు. గతంలో రోజుకు 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తుండగా వరి కోతలు ఎక్కువ కావడంతో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేశామని రోజుకు 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే లా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని మౌళిక వసతులతో పాటు తేమ కొలిచే యంత్రలు, టార్పలిన్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు. లోడింగ్ చేసిన ధాన్యాన్ని మిల్లులలో వేగంగా అన్ లోడింగ్ చేసి తిరిగి కొనుగోలు కేంద్రాలను వచ్చేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. కొనుగోలుకు అనుగుణంగా లారీలను ఏర్పాటు చేయాలని, అవసరం అయితే లారీల సంఖ్య పెంచాలని అధికారులను ఆదేశించారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉదయం సమయంలోనే ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇచ్చామని, అదే విధంగా ప్రతి కొనుగోలు కేంద్రంలో నీడ, తాగునీటి సౌకర్యం, ఓఆర్ఎస్ లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వాతావరణ మార్పుల దృష్ట్యా అకాల వర్షాలతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమములు ఆర్డిఓ సూర్యనారాయణ, తహసిల్దార్ వాజిద్ అలీ, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: హుజుర్నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.మంగళవారం హుజుర్నగర్ నియోజకవర్గ కేంద్రంలోనీ రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని, ఎలక్ట్రిసిటీ, స్ట్రీట్ లైట్, గ్రీనరీ, త్రాగునీరు, పైలాన్ స్తూపం స్థలాన్ని పరిశీలించి మిగిలి పోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని అని స్పష్టం చేశారు. అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ



చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు హౌసింగ్ పీడీ సిద్ధార్థ, హార్టికల్చర్ పిడి నాగయ్య, తహసిల్దార్ కవిత, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

### జేఈఈ మెయిన్స్ లో సత్తా చాటిన జయ జూనియర్ కళాశాల విద్యార్థులు



మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: జేఈఈ మెయిన్స్ లో జయ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించినట్లు జయ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సూర్యాపేట నుంచి 5 విద్యార్థులు 99 పైన పర్సంటేజ్ 26 గురు విద్యార్థులు 90 ఆపైన 74 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. కళాశాలకు చెందిన ఎన్. సాయి రిత్విక్ 99.55, జి శ్రీనిక 99.43, ఎస్ ఆశువర్ధన్ 99.36, ఎం రితిన్ శెట్టి 99.23, సిహెచ్ శివకుమార్ 99.09, ఎస్కె నేహా 98.68, డి సిరి 97.16, ఎండి హాదియా 96.96, జీ వంశీ 96.09, జి హర్షిత 95.92, వి గౌతమ్ కుమార్ 95.71 పర్సంటేజ్ సాధించారని తెలిపారు. ఆల్ ఇండియా అన్ని కేటగిరీ లలో 115, 563, 862, 963 లతో పాటు 5000 లోపు 10 ర్యాంకులు, 10,000 లోపు 18 ర్యాంకులు సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కృషిచేసిన అధ్యాపక బృందాన్ని కరస్పాండెంట్, డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి లు అభినందించారు.

## కొలిశెట్టిని అభినందించిన వైరా ఎమ్మెల్యే



మెట్రో న్యూస్, ఏన్కూరు, ఏప్రిల్ 21: ఏన్కూర్ ఆర్.ఎం.పి వైద్యుడు కొలిశెట్టి నరేష్ జన్మదిన సందర్భంగా వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్,సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు బుధవారం అభినందించారు. స్వీటు తినిపించి భగవంతుడు నిండు నూరేళ్ల ఆయుష్ ప్రసాదించాలని వారు కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ నరేష్ వైద్య సేవలు అభినందనీయమని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ట్రస్టు ద్వారా నిరుపేదలకు సహాయం అందిస్తున్న నరేష్ ను ప్రత్యేకంగా అభినందించాలన్నారు .మునుముందు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి, ఆది నరసింహారావు, ఈవూరి సైదులు, మహేష్, గోవిందు, వెంకటేశ్వర్లు, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిసి సమ్మెకు సిపిఐ, ఏఐటియుసి మద్దతు

ఖమ్మం మెట్రో ఈవెనింగ్ ఏప్రిల్21: ఆర్టిసి కార్మికులు బుధవారం నుంచి తలపెట్టిన సమ్మెకు సిపిఐ, ఏఐటియుసి ఖమ్మం జిల్లా కమిటీలు పూర్తి స్థాయి మద్దతు ప్రకటించాయి. ఆర్టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం -పరిశీలించకపోవడం వల్లే సమ్మె అనివార్యమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ప్రభుత్వం ఆర్టిసి కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యం, సాచివేత ధోరణిని అవలంభించిందని అందుకే కార్మికులు సమ్మెకు దిగకతప్పలేదని సురేష్ తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి వెంటనే కార్మికులతో చర్చించి సమస్యను -పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టిసిలో విలీనం, పిఆర్సి చెల్లింపు తదితర సమస్యలను పరిష్కరించాలని -ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు సమ్మెకు సిపిఐ, ఏఐటియుసి, ఇతర ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నాయని ఆర్టిసి కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని సిపిఐ, ఏఐటియుసి నాయకులు పిలుపునిచ్చారు. సమ్మెకు పూర్తి మద్దతు నిస్తున్నట్లు ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు తెలిపారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(మెట్రో న్యూస్): జిల్లాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తహసీల్దారులు ఎంపీడీవోలు ఏటీఎంలు సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 83,635 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని మొత్తం 168 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపట్టేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 56 కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరిందని ముఖ్యంగా ములకలపల్లి అన్నపురెడ్డిపల్లి ప్రాంతాల్లో అధికంగా ధాన్యం వచ్చినట్లు తెలిపారు.

వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం గ్రేడింగ్ ప్రక్రియను సక్రమంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. రైస్ మిల్లర్ల నుండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంక్ గ్యారంటీలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని టెంట్లు తాగునీరు విద్యుత్ వసతి కల్పించడంతో పాటు టార్పాలిన్లు ప్యాడీ క్లీనర్లు తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలని కూలీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు తమ కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే విక్రయించాలని పిలుపునిచ్చారు. ధాన్యాన్ని తాలు తడి లేకుండా శుభ్రంగా కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మిల్లుల కేటాయింపులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# ఆత్మీయ భరోసా అమలు చేయాల్సిందే

### వీబీజీ రాంజీ తో పనికి దూరమవుతున్న పేదలు

### ఉపాధి పని ప్రదేశాలలో వ్యకాస సర్వే



కారేపల్లి, మెట్రో ఈవివెనింగ్ ఏప్రిల్ 21: భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అంటూ ఆశ చూపిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు భరోసా కల్పించడం లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. మంగళవారం సింగరేణి మండలంలో ఉపాధి పని నిర్వహిస్తున్న ప్రదేశాలలో వ్యకాస సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా వ్యకాస నేత కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ జాబ్‌కార్డులు కలిగి భూమిలేని 22లక్షల మంది వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా అమలు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడాదికి అరకొరగా అమలు చేశారని విమర్శించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన వీబీజీ రాంజీ తో పేదలు ఉపాధి దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ లో ప్రతి సారీ నిధులు తగ్గించుకుంటూ వస్తుందని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు పరచి, విబిజీరాంజీ బిల్లుగా మార్పు చేసి కేంద్రం 60%నిధులు విడుదల చేసి మిగిలిన 40% నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరాయించాలని చెప్పటం సరి కాదన్నారు. యూపీఏ-1 ప్రభుత్వం 2005లో చేసిన చట్టాన్ని యధార్థంగా కొనసాగించాలని ఆయన. డిమాండ్ చేశారు. ఎండల వేడి తీవ్రతతో ఉపాధి కూలీలు ఇబ్బంది పడుతున్నారని, పని ప్రదేశంలో రెండుసార్లు ఫోటో పద్ధతిని ఎత్తివేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఉపాధి కూలీల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, పని ప్రదేశంలో టెంటు, మంచినీళ్లు మెడికల్ కిట్టు తదితర వసతులు కలిపించాలన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధి హామీ పని ప్రదేశాల్లో చేపట్టిన సర్వేలో వెలుగులోకి వచ్చిన సమస్యలనీ పరిష్కారానికి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు. ఈ సర్వే కార్యక్రమంలో వ్యకాస మండల అధ్యక్ష కార్యదర్శులు యనమనగండ్ల రవి, కేసగాని ఉపేందర్నా, నాయకులు పాసిని నాగేశ్వరరావు, చల్లా మల్లమ్మ, షేక్ సైదులు, కరపటి అరుణ, మద్దెల నాగయ్య, అన్నారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వీఎస్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



మెట్రో న్యూస్ ఎర్రుపాలెం(ఏప్రిల్ 21) :- మండలంలోని జమలాపురం గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో వీఎస్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజండ్ల సాయికుమార్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని సర్పంచ్ తుళ్ళూరు నిర్మల కుమారితో కలసి మంగళవారం ప్రారంభించారు. శ్రీవారిని దర్శించుకునేందుకు వేసవిని సైతం లెక్కచేయకుండా వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారని,వారి దాహార్తిని తీర్చడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. గత మూడేళ్ళుగా వేసవికాలంలో భక్తుల దాహం తీర్చేందుకు తన ఫౌండేషన్ ద్వారా నిరంతరయంగా చాలివేంద్రాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఎండ తీవ్రత 40లీడిగ్రీలు దాటుతుందని, దూరప్రాంతల నుంచి ఆలయానికి వచ్చే భక్తులకే గాక గ్రామస్తులకు, ప్రయాణికులకు,బాటసారులకు సైతం దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నన్నపనేని రామారావు,అంకసాల శ్రీనివాసరావు, వెంకట్రామిరెడ్డి, ఫౌండేషన్ నిర్వహుకులు పాతూరి శ్రీనివాసరావు, అయిలూరి వెంకట్రామిరెడ్డి, చొప్పవరపు శ్రీనివాసరావు, భూక్యా శ్రీనివాసులు,బాణాల నాగసాయి,పి వెంకటేశ్వర్లు,కుమారి,మహేష్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజల దాహర్తి తీర్చడమే లక్ష్యం

### భాగ్యనగర్ తండా సర్పంచ్ హీరాలాల్




కారేపల్లి, మెట్రో ఈవివెనింగ్ ఏప్రిల్ 21: వేసవి కాలం లో ప్రజల దాహర్తి తీర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం అని భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్ అన్నారు, మంచి నీటి కొరత తీర్చుడానికి గాను భాగ్యనగర్ తండా 5 వార్డ్ లో వేసిన మంచినీటి బోర్ కు ఈ రోజు మోటార్ బిగించి ప్రజలకు మంచినీటి సరఫరా కార్యక్రమం ను వారు ప్రారంభించినారు, అందరు నీటిని పొదుపుగా వాడుకోవాలని, పక్షుల, ఇతర జీవలా కొరకు మంచినీటి పాత్రలు ఏర్పాట్లు చేయాలనీ ప్రజల కు సూచించారు, ఈ కార్యక్రమం లో వార్డ్ సభ్యురాలు జర్పలా సంధ్య, పార్టీ జిల్లా నాయకులు భీముడు నాయక్, సందీప్, సోమ్లా, గిరిప్రసాద్, ఝూంకిలాల్, పంచాయతీ సిబ్బంది హేంచంద్, రాందాస్ రమేష్, రాధా,చరణ్ మిషన్ భగీరధఆపరేటర్ తదితరులు పాల్గొన్నారు

## విశ్వబ్రాహ్మణులను ముక్కలు చేసి చూపడం ప్రభుత్వ కుట్ర

### ఉసర్వే గణాంకాలను తక్షణమే సవరించాలి

### విశ్వకర్మ రాష్ట్ర నాయకులు తుమ్మోజు రామమూర్తి డిమాండ్.



కారేపల్లి, మెట్రో ఈవివెనింగ్ ఏప్రిల్ 21:తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సామాజిక ఆర్థిక సర్వేలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సామాజిక వర్గాన్ని అవమానపరిచే రీతిలో గణాంకాలను విడుదల చేయడాన్ని విశ్వకర్మ రాష్ట్ర నాయకులు తుమ్మోజు రామమూర్తి తీవ్రంగా ఖండించారు. మంగళవారం మండల కేంద్రమైన కారేపల్లి లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో మండల విశ్వకర్మ /విశ్వబ్రాహ్మణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల నాయకులు వేములూరి కోటాచారితో కలిసి ఆయన మాట్లాడుతూ విశ్వకర్మలపై అనుసరిస్తున్న ప్రభుత్వ విధానాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బి.సి-బి గ్రూపులో సీరియల్ నంబర్ 21లో ఉన్న విశ్వబ్రాహ్మణ/విశ్వకర్మ' అనే చట్టబద్ధమైన కుల నామాన్ని పక్కన పెట్టి,కేవలం వృత్తుల వారీగా జనాభాను ముక్కలు చేసి చూపడం వెనుక ఉన్న మతలబు ఏమిటని ఆయన ప్రశ్నించారు.ఇది విశ్వకర్మల అస్తిత్వాన్ని దెబ్బతీసి, కులాన్ని బలహీనపరిచే కుట్ర అని ఆయన ఆరోపించారు. ఇతర కులాల పేర్లను మాతృభాషలో గౌరవప్రదంగా పేర్కొంటూ, విశ్వబ్రాహ్మణులను మాత్రం గోల్డ్ స్మిత్,బ్లాక్ స్మిత్, బ్రాంజ్ స్మిత్ అంటూ ఆంగ్ల పదాలతో విడగొట్టి చూపడం భాషా వివక్షే కాకుండా,సామాజిక వర్గ గౌరవాన్ని కించపరచడమేనని మండిపడ్డారు.ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన అంకెల్లో పారదర్శకత లేదని,ఒకవేళ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే గ్రామాల వారీగా సర్వే చేసిన లబ్ధిదారుల పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.సర్వే రికార్డులలో వృత్తి పేరును తొలగించి, 'విశ్వబ్రాహ్మణ/విశ్వకర్మ' అనే కుల నామాన్ని పునరుద్ధరించాలని, విడివిడిగా చూపిన ఐదు వృత్తుల గణాంకాలను ఏకం చేసి పూర్తి జనాభా వివరాలను అధికారికంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో నిర్వహించే ఏ గణన అయినా కుల నామాలతోనే జరగాలని స్పష్టం చేశారు.ఇప్పటికే నిర్వహించిన సర్వేను ఉపసంహరించుకొని నూతనంగా విశ్వకర్మ పేరుతో సర్వే చేసి తమ జాతీయలను గుర్తించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో విశ్వకర్మ నాయకులు అద్దంకి వీరభద్రచారి,పోలోజు ఉపేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతకు ఆదర్శంగా మధిర పట్టణాన్ని తీర్చిదిద్దుతా

# మడుపల్లి మెయిన్ రోడ్, వార్డుల్లో సీసీ రోడ్ల కోసం కృషి చేస్తా

### మడుపల్లి మెయిన్ రోడ్, వార్డుల్లో సీసీ రోడ్ల కోసం కృషి చేస్తా

### రోడ్ల నిర్మాణం కోసం డిప్యూటీ సీఎం విక్రమార్క గారిని కలుస్తా చైర్మన్ సుజాత



మెట్రో న్యూస్ మధిర (ఏప్రిల్ 21):-స్వచ్ఛతకు ఆదర్శంగా మధిర పట్టణాన్ని తీర్చిదిద్దటందుకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత కోరారు.మంగళవారం మధిర మున్సిపాలిటీ మడుపల్లిలో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, 5,6,7 వార్డు కౌన్సిలర్ల తో కలిసి చైర్మన్ సుజాత విస్తృతంగా పర్యటించారు.ముందుగా డ్రై రిసోర్స్ కన్స్ట్రక్షన్ సెంటర్ (డి ఆర్ సి సి)తడి పొడి చెత్త వేరు చేయు మిషన్ సెంటర్ ని సందర్శించారు.ఈ సందర్భంగా అక్కడ సిబ్బందితో చైర్మన్ సుజాత మాట్లాడారు.తడి చెత్తను (ఆహార వ్యర్థాలు,కూరగాయల వ్యర్థాలు)సేంద్రీయ ఎరువుగా మార్చి ఈ ఎరువును రైతులకు విక్రయించడం ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా చూడాలని సూచించారు.అలాగే ప్రజల్లో తడి,పొడి చెత్త వేరుచేసి ఇచ్చే పద్ధతిపై శానిటేషన్ అధికారులు అవగాహన కల్పించాలని అన్నారు.

**మడుపల్లి వీధుల్లో సి సి రోడ్లు కోసం కృషి చేస్తా**

మడుపల్లి 5,6,7, వార్డుల్లో మెయిన్ రోడ్,వార్డుల్లో సి సి రోడ్ల కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కని కలిసి మడుపల్లి రోడ్ల సమస్యను వివరిస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత తెలిపారు.మడుపల్లి సైడ్ డ్రైనేజీలు రోడ్లు సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు

# భూ రికార్డుల్లో 'సువర్ణాధ్యాయం'!

### కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్. రాష్ట్రంలో కొత్త శకం

### భూధార్‌తో రైతు హక్కుకు శాశ్వత భరోసా.

### పాలేరు గడ్డపై సంస్కరణల జెండా

### ఐదు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా 'భూభారతి' అమలుకు మంత్రి పొంగులేటి అంకురార్పణ

మెట్రో ఈవినింగ్ కూసుమంచి ఏప్రిల్ 21:కూసుమంచి తెలంగాణ రెవెన్యూ చరిత్రలో మంగళవారం ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఏళ్ల తరబడి రైతులను వేధిస్తున్న భూ తగాదాలకు చరమగీతం పాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సర్వే మ్యాప్ ఆధారిత రిజిస్ట్రేషన్' ప్రక్రియ పట్టాలెక్కింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని కుసుమంచి మండలం నుంచి ఈ విప్లవాత్మక మార్పుకు అంకురార్పణ చేశారు. రైతు జీవితం భూమితో ముడిపడి ఉందని, ఆ హక్కుకు సర్వే మ్యాప్ మరియు భూధార్‌తో రక్షణ కల్పించినప్పుడే రైతు కుటుంబానికి భవిష్యత్తుపై నమ్మకం కలుగుతుందని మంత్రి ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

మ్యాప్ ఉంటేనే రిజిస్ట్రేషన్.వివాదాలకు శాశ్వత చెక్

గతంలో రిజిస్ట్రేషన్ అంటే కేవలం కాగితాల మీద రాసుకునే దస్తావేజులు మాత్రమే ఉండేవి. దీనివల్ల సరిహద్దు వివాదాలు తలెత్తి రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ 'భూభారతి' చట్టం ద్వారా రిజిస్ట్రేషన్ సమయంలో ఆ భూమికి సంబంధించిన స్పష్టమైన సర్వే మ్యాప్ (ఎల్ పి ఎం) ఉండటాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఇందులో భాగంగా కూసుమంచి మండలం గట్టు సింగారం గ్రామంలోని సర్వే నంబర్ 156/ఇ/1 లో గల ఒక ఎకరా నాలుగు గుంటల భూమికి సంబంధించి రాష్ట్రంలోనే తొలి 'మ్యాప్ ఆధారిత' రిజిస్ట్రేషన్ జరిగింది. నేలకొండపల్లి మండలం మోటాపురం గ్రామానికి చెందిన రైతు భాగం కిషన్ రావు తన భూమిని, అదే గ్రామానికి చెందిన కట్టా వెంకటేశ్వరరావుకు విక్రయించగా. తహసీల్దార్ కార్యాలయంలో భూమి హద్దులతో కూడిన మ్యాప్‌ను జతచేసి ప్రక్రియను పూర్తి చేశారు. దీనివల్ల భవిష్యత్తులో పొరుగు రైతులతో వచ్చే సరిహద్దు తగాదాలకు ఇకపై తావుండదు.

**భూమికి విశిష్ట గుర్తింపు.'భూధార్'తో పక్కా భద్రత**

మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్టే, ఇకపై ప్రతి భూకమతానికి ఒక విశిష్టమైన 'భూధార్' నెంబర్‌ను ప్రభుత్వం కేటాయిస్తోంది. కూసుమంచిలో జరిగిన ఈ చారిత్రక రిజిస్ట్రేషన్‌కు '795+జఎఱ-జఖూజీ7ఎ0' అనే భూధార్ సంఖ్యను (భూ కమత పటము-1) కేటాయించారు. దీనివల్ల భూమి యజమాని వివరాలు, విస్తీర్ణంపై ఎలాంటి సందేహాలకు తావుండదు. యాజమాన్య హక్కులను శాశ్వతంగా నిర్ధారించడమే కాకుండా, ఎవరైనా స్వచ్ఛందంగా తమ ఆస్తుల సర్వే సర్టిఫికేట్ పొందాలనుకుంటే కూడా దరఖాస్తు చేసుకునే వీలును ప్రభుత్వం కల్పించింది. ఈ విధానం ద్వారా భూ వ్యవహారాల్లో పూర్తిస్థాయి పారదర్శకత వస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

**ఐదు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్.దేశానికే దిక్సూచి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తూ రూపొందించిన 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌ను ఈ నెల 2వ తేదీ నుంచి ఐదు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలంతో పాటు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలాల్లో ఈ కొత్త నిబంధనలు అమలులోకి వచ్చాయి. పాతకాలపు గొలుసు సర్వేలకు స్వస్తి పలికి, అత్యాధునిక 'రోవర్ల' సహాయంతో కచ్చితమైన కొలతలు తీస్తున్నారు.

# జనహృదయ నేతకు నీరాజనం

## -హట్టహాసంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ జన్మదిన వేడుకలు

మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు , అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయం వద్ద పండుగ వాతావరణాన్ని తలపించింది. పట్టణం అంతటా ఎమ్మెల్యే ఫ్లెక్సీలు, బ్యానర్లు అలంకరించగా, కార్యకర్తలు, అభిమానుల సందడి నెలకొంది. మండలాల వారీగా వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రేన్లతో గజమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఎమ్మెల్యేను జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణుల మధ్య భారీ కేక్ కట్ చేసి వేడుకలను మరింత ఉత్సాహభరితంగా మార్చారు. ఈ సందర్భంగా సంగారెడ్డి పట్టణం 13వ వార్డు సభ్యుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి సేవా భావాన్ని చాటుకున్నారు. ప్రత్యక్షంగా, సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.





## పోషణ ఆరోగ్యం విద్య అందించే అంగన్వాడి కేంద్రం అమ్మ వంటిది. కౌన్సిలర్ రేఖా ప్రవీణ్.



మెట్రో న్యూస్ జోగిపేట్.పిల్లలకు పోషణ విద్య ఆరోగ్యం అందించే అంగన్వాడీ కేంద్రం అమ్మ వంటిదని అలాంటి దాన్ని చులకన చేయకుండా ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని అంగన్వాడి కేంద్రంలో చేర్పించి పిల్లల్ని బాగుపరచాలని ఆందోల్ జోగిపేట మున్సిపల్ పదవ వార్డ్ కౌన్సిలర్ పట్లోళ్లరేఖ ప్రవీణ్ అన్నారు. పదవ వార్డులోని అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన వార్షికోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎంతో విద్యా బుద్ధులు నేర్పుతూ, పాఠశాలలకు అలవాటు అయ్యే విధంగా ఇక్కడి టీచర్లు నేర్పుతున్నారని ఆమె వివరించారు ,ఇలాంటి స్కూల్ కి మన వార్డులోనే ఉన్నందున తప్పకుండా పంపించాలని పేర్కొన్నారు. సూపర్వైజర్ మేడం మాట్లాడుతూ విద్యార్థుల బ్రెయిన్ డెవలప్మెంట్ గురించి పేరెంట్లకు ఆటపాటలతో వివరించి తెలిపారు. అంగన్వాడీ టీచర్ సుమిత్ర మాట్లాడుతూ నిపున్భారత్ అంగన్వాడీలో మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల వరకు విద్య బుక్స్ సిలబస్ ఉంటుందని తెలిపారు. ఇందులో సంవత్సరం కార్యక్రమాల ప్రణాళిక, మాసం కార్యక్రమ ప్రణాళిక, వారం కార్యక్రమాల ప్రణాళిక, ఒక్కరోజు కార్యక్రమాల ప్రణాళికల గురించి వారికి సమవరంగా వివరించారు. గత నాలుగు సంవత్సరాలుగా వార్షికోత్సవం జరుపుకుంటున్నామన్నారు, ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రేఖ, అంగన్వాడీ టీచర్లు విజయ, సుమిత్ర, గౌరీ, ఆయా సల్మా, తల్లిదండ్రుల పిల్లలు యూత్ సభ్యులు, సూపర్వైజర్ అమృతవాణి, ప్రమీల, గుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ సంరక్షణే లక్ష్యం

### -జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

### -అంతర్జాతీయమదర్ ఎర్త్ డే సందర్భంగా గోడ పత్రిక ఆవిష్కరణ



మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో ఏప్రిల్ 21:అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే పక్షాన్ని పురస్కరించుకుని, “99 రోజుల ప్రజా పాలన” కార్యక్రమంలో భాగంగా నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను మంగళవారం కలెక్ట్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ పాండుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. “భూమిని కాపాడుకుందాం”, “ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం”, “పచ్చదనం పెంచుదాం” వంటి నినాదాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రకృతి సంపదను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించగలమని తెలిపారు. అలాగే, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెట్ల పెంపకం చేపట్టడం, నీటి వనరులను సంరక్షించడం వంటి చర్యలను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, యువత పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అందరూ కలిసికట్టుగా కృషి చేస్తేనే భూమి సంరక్షణ సాధ్యమవుతుందని, పర్యావరణ హిత చర్యలను నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, ఎన్ జి సీ జిల్లా సమన్వయ కర్త మాధవ రెడ్డి, ఎస్ జి ఎఫ్ సెక్రటరీ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దు

### -కొనుగోలు కేంద్రంలోనే మద్దతు ధర

### -దయ్యాల కుంటలో నీరు నింపి సాగునీరు అందించడమే లక్ష్యం

### -సర్పంచ్ బైర మానస



మెట్రో న్యూస్ బెజ్జంకి: రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని అమ్మి మద్దతు ధర పొందాలని దాచారం సర్పంచ్ బైరా మానస అన్నారు. గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో దయ్యాలకుంట పూడికతీత, మరమ్మత్తు పనులను ప్రారంభించి మాట్లాడుతూ.. వర్షపు నీరు చెరువులోకి వచ్చేలా చేసి చెరువు నుంచి సాగునీరు అందించేలా పనులు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దీట్టి బాల నర్సు, బైరా సంతోష్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ కళాశాలలో ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

మెట్రో న్యూస్ రాయికోడ్:మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల/కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి 2026 సంవత్సరం మార్చిలో నెలలో పరీక్షలు ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడము జరుగుతుందని తెలంగాణ ఆదర్శ పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ సి.సురేందర్ తెలిపారు.విద్యార్థులు ప్రతిరోజు ఉదయము ఎనిమిది గంటల నుండి



మధ్యాహ్నము ఒంటిగంట వరకు ప్రత్యేక తరగతులకు హాజరు కావాలని ఆయన కోరారు.

ఈ తరగతులు మే నెల12 తేదీ వరకు కొనసాగుతాయని,ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు కళాశాలలోనే మధ్యాహ్న సదుపాయం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

## మహిళా బిల్లుకు అడ్డు కాంగ్రెసే



మెట్రో న్యూస్ మెదక్:మహిళలకు అవకాశం కల్పించే మహిళా బిల్లుకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన అడ్డంకి అని బిజెపి మెదక్ జిల్లా మీడియా ఇంచార్జ్ చీకోటి ప్రవీణ్ అన్నారు. మెదక్ లోని బిజెపి జిల్లా కార్యాలయంలో మంగళవారం జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో మహిళా బిల్లు రూపకల్పనకు చర్యలు చేపడితే పార్లమెంట్ సాక్షిగా కాంగ్రెస్ పక్షాలు అడ్డుకున్నాయని తెలిపారు. కాంగ్రెస్ నాయకత్వం తమ ఉనికిని కాపాడుకునేందుకు మహిళల అభివృద్ధిని అడ్డుకోవడం తగదన్నారు. నారీ శక్తి అంటూ గొప్పలు పలికే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తూ మహిళా సాధికారతను అడ్డుకుంటుందన్నారు. దశాబ్దాల కాలంగా పెండింగ్ లో ఉన్న మహిళా బిల్లు అమలు అయ్యే సమయంలో సభను తప్పుదోవ పట్టించి బిల్లును ఆపడం శోచనీయమని తెలిపారు. మహిళా బిల్లు ఆమోదంకు ఇప్పటికైనా కాంగ్రెస్ వైఖరిలో మార్పు రావాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్, నాయకులు బెండవీన, శైలజ, స్వప్న, రమేష్, రాజమణిలక్ష్మణ్, మల్లికా, శ్రీనివాస్, శైలజ, గీత,లోకేష్, అల్లం మధు తదితరులు పాల్గొన్నారు.

## గాగిల్లాపూర్ లో పోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ట

### -హాజరైన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మెట్రో న్యూస్ బెజ్జంకి: గాగిల్లాపూర్ గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ పునర్ :ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మానకొండూరు నియోజకవర్గం ఎమ్మెల్యే సత్యనారాయణ హాజరు కాగా సర్పంచ్ ఎర్రళ్ల జానకి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పోచమ్మ తల్లిని ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ , ఉప సర్పంచ్ పద్మ,పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి ఆలయ చైర్మన్ జిల్లా ప్రభాకర్ ఎర్రల రాజు, శ్రీనివాస్ రెడ్డి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపిటీసి, జెడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కండి

### -సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో కార్యకర్తలకు, నాయకులకు మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపు

### -మహిళా బిల్లు విషయంలో బీజేపీ చేసిన కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

### -డిసిసి అధ్యక్షురాలు, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:ఎంపిటీసి, జెడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కండని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. సంగారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్ లో మంగళవారం సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రితో పాటు జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు, పఠాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ... ప్రభుత్వం, పార్టీ కలిసి సమన్వయంతో ముందుకు వెళ్తేనే విజయం సాధిస్తామని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలిచామని, మున్సిపల్ ఎన్నికల్లో సైతం అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్నామన్నారు. అయినప్పటికీ జిల్లాలో ఇంకా నాయకుల మధ్య సమన్వయం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్ని సంక్షేమ పథకాలను చేపట్టినా, ఆ సందేశాన్ని, స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తల పైనే ఉంటుందన్నారు. కార్యకర్తలకు సముచిత స్థానం ఇవ్వాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటి నుండే సన్నద్ధం కావాలని, పార్టీ నాయకుల మధ్య వర్గ పోరు ఉండొద్దన్నారు. నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు ఉండటం సహజమే.. కానీ వర్గ పోరు వల్ల పార్టీకి నష్టం జరుగుతుందన్నారు. డెబ్భై వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, ఇప్పటివరకు కేవలం ఆరోగ్య శాఖలోనే దాదాపు ఇరవై వేల ఉద్యోగాలు ఇచ్చామని వివరించారు. లక్ష ఇరవై వేల కోట్ల రూపాయలను రైతు బంధు రూపంలో రైతులకు అందించామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన విజయవంతంగా అమలవుతోందన్నారు. నలభై ఆరు లక్షల మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేపట్టామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా డిజిటల్ హెల్త్ కార్డ్ లు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జహీరాబాద్, నారాయణ్ ఖేడ్ ఆసుపత్రులలో మరో 50 పడకలు అదనంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సంగారెడ్డి మెడికల్ కళాశాలలో భవిషత్తులో పీజీ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నరు. సింగూరు ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. 200 కోట్లతో సింగూరు ప్రాజెక్టును టూరిజం స్పాట్ గా అభివృద్ధి చేస్తామన్నారు. విద్య, వైద్యం, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత అని ఆ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ముందుకెళ్తోందని అన్నారు. మహిళా బిల్లుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని సెపరేట్ గా బిల్లు పెడితే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతిస్తుందన్నారు. డీలిమిటేషన్ ఉన్నా లేకున్నా మరోసారి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని పిలునిచ్చారు. నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలను ఎలా ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలా గెలిచాం, మన బలాబలాలు, లోపాలపై చర్చించుకోవాలన్నారు. వచ్చే ఎంపీటీసి, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలి అనే విషయంలో చర్చ జరగాలన్నారు. మూడేళ్లకు పైగా మండలస్థాయిలో పనిచేసిన వారికి, జిల్లా స్థాయిలో పదవులు ఇచ్చి, వారి స్థానంలో మండలంలో కొత్తవారిని నియమించాలని సూచించారు. ప్రభుత్వం ఉన్నది కాబట్టి అభ్యర్థుల ఎంపికలో పోటీ ఉందని, మన మధ్యే మనకే పోటీ వల్ల పార్టీకి నష్ట జరుగుతుందన్నారు. మొన్న పార్లమెంట్ లో జరిగిన పరిణామాలను, ఎందుకు మహిళా బిల్లును కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందో మహిళా బిల్లు విషయంలో బీజేపీ కుట్రలను సైతం పార్టీ పరంగా చర్చ జరగాలని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్పర్సన్ సునీతా పాటిల్, పిసీసి ప్రధాన కార్యదర్శులు తోపాజి అనంత్ కిషన్, చిన్నా ముదిరాజ్, నాయకులు శశికళా యాదవ్ రెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ కూన వనితా సంతోష్, సదాశివపేట మున్సిపల్ చైర్మన్ అంజమ్మ సత్యనారయణ, కోహీర్, జోగిపేట మున్సిపల్ చైర్మన్ లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సహకరించండి

### ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకుంటే ప్రజా ఉద్యమం తప్పదు..

### బీహెచ్ఈఎల్ యాజమాన్యానికి విన్నవించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..



(మెట్రో న్యూస్)రామచంద్రాపురం:రామచంద్రపురం డివిజన్ పరిధిలో గల బిహెచ్ఇఎల్ భూములకు సంబంధించి నెలకొన్న వివాదాలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కాలయాపన చేస్తే ప్రజల నుండి వ్యతిరేకత ఎదురుకోవాల్సి వస్తుందని బిహెచ్ఈఎల్ యాజమాన్యానికి పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. మంగళవారం బిహెచ్ఇయల్ ఈడి శ్రీనివాస్, ఏజిఎం సురన్ ప్రసాద్ లతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా ఈఎస్ఐ చర్చి సమీపంలో గల బీరప్ప గుడిని బిహెచ్ఇయల్ పరిశ్రమ భూమిలో ఉందంటూ సంబంధిత అధికారులు తొలగించడం జరిగిందని తెలిపారు. ఇది మాత్రం సమంజసం కాదని.. పరిశ్రమ ఏర్పాటు చేయకముందు నుండి గుడి అక్కడే ఉందని తెలిపారు. వెంటనే అదే స్థలంలో గుడిని పునర్నిర్మాణం చేపట్టకపోతే ప్రజల నుండి తీవ్ర నిరసన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన అంశాలలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రామచంద్రపురం రాయసముద్రం చెరువు సుందరీకరణ అంశంలో ఎందుకు అడ్డుపడుతున్నా రంటూ ప్రశ్నించారు. స్థానికులకు సైతం అనుమతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్లు పుష్ప నగేష్, అంజయ్య, సీనియర్ నాయకులు పరమేష్, ఐలేష్,రామచంద్రపురం పుర ప్రముఖులు,తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్,
బుధవారం
ఏప్రిల్ 22 ,2026

మెట్రో
గ్రేటర్ హైదరాబాద్
9

జిల్లాలు
హైదరాబాద్
రంగారెడ్డి
మేడ్చల్

# అవసరం ఉన్న చోట ఫ్లై ఓవర్ నిర్మించండి

## ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**మెట్రో న్యూస్.ఎల్ బి నగర్:** అవసరం ఉన్న చోట ఫ్లై ఓవర్ నిర్మించండి,అవసరం లేని చోట ఫ్లైఓవర్ నిర్మాణం అవసరం లేదు: ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి . చంపాపేట్ డివిజన్ పరిధి లోని ఓవైసీ నుంచి కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం వెళ్లే ప్రధాన రహదారిపై నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ ఇట్టి ప్రభుత్వం టీ.కె.ఆర్.కమాన్ చౌరస్తా నుండి ఓవైసి చౌరస్తా వరకు ఆరు లైన్ల విస్తరణ పేరిట దాదాపు 240 మందికి నోటీసులు ఇవ్వడం జరిగింది.నూతన ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల ఎన్నో ఏండ్ల నుండి నివాసం ఉంటున్న మేము ఎక్కడికి పోవాలి అని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే ఉన్న వసతులు మా ఏరియాలో 150 ఫీట్ల ఇన్నర్ రింగ్ రోడ్డు అందు బాటులో ఉందని తెలిపారు.కానీ మళ్ళీ ఇప్పుడు 25 ఫీట్ల మేరకు రోడ్డు విస్తరణ పేరిట మా ఇల్లు కూలగొట్టడం జరుగుతుంది అని తెలపడం ఎంతవరకు సబాబు అని అన్నారు.జీవితాంతం కష్టపడి కట్టుకున్న ఇల్లు కోల్పోవడం వల్ల మేము రోడ్డు మీద పడే పరిస్థితి ఏర్పడింది కావున ఇట్టి నూతన ఫ్లైఓవర్ ప్రతిపాదనలు విరమించుకోవాలని కోరారు.అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఇక్కడ ఉన్న 150 ఫీట్ల ఇన్నర్ రింగ్ రోడ్డు వల్ల భవిష్యత్తులో దాదాపు మరో 25 సంవత్సరాల వరకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఉండవని తెలిపారు.ఇక్కడ ఫ్లైఓవర్ అవసరం లేదని అన్నారు.గతంలో నేను బండ్లగూడ ఆనంద నగర్ చౌరస్తా హస్తినాపురం చౌరస్తా వద్ద నూతన ఫ్లైఓవర్ మంజూరు చేయాలని కోరడం జరిగింది.అక్కడ ప్రతినిత్యం ఉదయం సాయంత్రం తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఉంటాయని తెలిపారు.కానీ అక్కడ మంజూరు చేయకుండా ఇక్కడ మంజూరు చేయడం హాస్యాస్పదం అని అన్నారు.ఇట్టి నూతన ఫ్లైఓవర్ విషయంలో ప్రభుత్వం దృష్టికి పెద్ద ఎత్తున తీసుకెళ్లి విరమింపచేసే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.ఇట్టి కార్యక్రమంలో భారస నాయకులు రాజిరెడ్డి,ముద్ద కళ్యాణ్,చలమల యాదిరెడ్డి,రవి ముదిరాజ్ ,ప్రభాకర్, కనకేష్, జంగయ్య ,చందు ,శ్రీనివాస్, రమాదేవి కాలనీవాసులు జగదీశ్, నవరత్నం, నర్సింహా, సురేష్, శ్యామ్, శ్రీనివాస్ సాగర్ ,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులను అన్నివిధాలా ప్రోత్సహిస్తాం : ఎమ్మెల్యే కృష్ణారావు



**మెట్రో న్యూస్, కేపీహెచ్‌బీ కాలనీ :** కూకట్‌పల్లికి చెందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటి పథకాలు గెలుచుకోవడం నియోజకవర్గానికి గర్వకారణమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. తెలంగాణ స్టేట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 59 కేజీల విభాగములో గోల్డ్ మెడల్ సాధించిన మూసాపేటలోని అంబేద్కర్ నగర్ కు చెందిన పాతపల్లి శివశంకర్ ను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావు మంగళవారం అభినందించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు ప్రతిభా పాటవాలు చాటడం సంతోషకరమన్నారు. క్రీడాకారుల అభ్యున్నతికి నిరంతరం పాటుపడతానని చెప్పారు. ప్రతిభ గల క్రీడాకారులను అన్నివిధాలుగా ప్రోత్సహించి వారికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ప్రభృతులు పాల్గొన్నారు.

## సంస్కార్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ ఎల్ఎల్‌పి కార్యాలయాన్ని ప్రారంభించిన ఎర్రబెల్లి



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** నూతనంగా ఏర్పాటు చేసిన సంస్కార్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ ఎల్.ఎల్.పి కార్యాలయాన్ని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు (ఈఎస్ఆర్) మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. యాజమాన్యం పవన్, సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింహారావు, ఏకాంబరం, కిషోర్, బ్రహ్మం, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం

### ఇటలీ రాయబారితో మంత్రి శ్రీధర్‌బాబు భేటీ



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** అడ్వాన్స్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేలా ఇటలీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆ దేశ ప్రతినిధులను ఆయన కోరారు. ఇటలీ దేశ రాయబారి 'ఆంటోనియో బార్టోలి' నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మంగళవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ఈ సందర్భంగా.... ఏయే రంగాల్లో 'తెలంగాణ ఇటలీ' కలిసి పని చేసేందుకు అవకాశాలున్నాయనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. నేడు ఐరోపాలోనే అత్యంత బలమైన ఎగుమతి ఆధారిత, ఉత్పాదక రంగం కలిగిన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఇటలీ కొనసాగుతోందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. మెషీనరీ, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఆటోమోటివ్ సిస్టమ్స్, ఫార్మాస్యూటికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలలో ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. తెలంగాణను గ్లోబల్ 'మ్యానుఫ్యాక్చరింగ్ హబ్'గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, అనుసరిస్తున్న వ్యూహాలను, పాలసీలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. 'భారత్ ఇటలీ' మధ్య బలపడుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఊతమిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## బడంగ్‌పేట్‌లో అక్రమ కూల్చివేతలపై అధికారులతో సమీక్ష

### - ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశం



**మెట్రో న్యూస్, బడంగ్‌పేట్:** మహేశ్వరం నియోజకవర్గంబడంగ్‌పేట్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బడంగ్‌పేట్ పరిధిలో జరుగుతున్న అక్రమ కూల్చివేతలపై, ముఖ్యంగా ఫుట్‌పాత్‌ల తొల గింపులపై ఎమ్మెల్యే సవివరంగా ఆరా తీశారు. కూల్చివేతల ప్రక్రియలో సాధారణ ప్రజలు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొనకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా త్రాగునీటి సరఫరా, శానిటేషన్ సమస్యలు, రహదారుల పరిస్థితి, వీధి దీపాల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలపై కూడా సమగ్రంగా చర్చించారు. ఇప్పటికే టెండర్లు ఖరారైనప్పటికీ ప్రారంభం కాని అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి, కొనసాగుతున్న పనులను వేగవంతం చేయాలని సూచించారు.ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఫీల్డ్ స్థాయిలో పరిశీలనలు నిర్వహించాలని, సమస్యలు వచ్చిన వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో డ్రైనేజ్ వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని కూడా ఆమె సూచించారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ, ఎమ్మెల్యే సూచనల మేరకు పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.ఈ సమావేశంలో డిఈ, ఏఈ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## డీఐ శేఖర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన సీఎంఆర్



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి సర్కిల్ పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్స్ పెక్టర్ (డీఐ)గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శేఖర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు (సీఎంఆర్) మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిరుమర్తి రాజు మాట్లాడుతూ, శాంతిభద్రతలను పరిరక్షించడంతో పాటు నేరాలను అదుపు చేయడంలో పోలీసుల సేవలు కీలకమైనవన్నారు. నేరాలను అరికట్టి సంఘ విద్రోహ కార్యకలాపాలను నిర్మూలించేందుకై పౌరులు బాధ్యతగా పోలీసులకు సహకరించాలని చిరుమర్తి కోరారు.

## వ్యాపార సంస్థలు సమాజంలోని అన్ని వర్గాల భావాలను గౌరవించాలి



**మెట్రో న్యూస్, కొత్తపేట:** లెన్స్‌కార్ట్ సీఈవో వ్యాఖ్యలపై ఆగ్రహంకొత్తపేటలో షాప్‌ను సందర్శించిన మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కళ్యాణ్ కుమార్ఇటీవల లెన్స్‌కార్ట్ సీఈవో పీయూష్ బన్సాల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ తన కార్యకర్తలతో కలిసి స్థానిక లెన్స్‌కార్ట్ షాప్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా షాప్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు బొట్టు పెట్టడం ద్వారా హిందూ సంప్రదాయాల ప్రాముఖ్యతను తెలియజేశారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సంస్కృతిని గౌరవించాలిఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు భవిష్యత్తులో మళ్లీ చేయకూడదు ప్రజల భావాలను గౌరవించడం ప్రతి సంస్థకు బాధ్యతఅని స్పష్టం చేశారు.అదేవిధంగా వ్యాపార సంస్థలు సమాజంలోని అన్ని వర్గాల భావాలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. దేశంలో ఉన్న విభిన్న సంస్కృతులను కాపాడే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు మంచి రాజేష్ కుమార్, జిల్లా నాయకులు వగ్గుల సుందర్ నారాయణ, కాటా విజయ గౌడ్, లావణ్య , శ్రీనివాస్ రెడ్డి, తిరుమల , వెంకట్ రెడ్డి, గట్టు మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిబాట్ల సర్వీస్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం

### డీసీఎం డ్రైవర్ రాష్ డ్రైవింగ్‌తో ఒక నిండు కుటుంబంలో విషాదం

### ఒకే కుటుంబానికి చెందిన తండ్రి,కొడుకు మృతి



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** ఔటర్ సర్వీస్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గుర్తుతెలియని డీసీఎం బైక్ ను ఢీకొట్టింది. బైక్ పై ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన తండ్రి కొడుకులు మృతి చెందారు. ఈ విషాదకర ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం, సాహెబ్ గూడ లో నివాసం ఉండే కొమ్మగోని ప్రశాంత్ గౌడ్ (41), వృతి విద్యుత్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా మంగళవారం ఉదయం తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి తన బైక్ పై రావిర్యాలలోని సూర్యగిరి ఎల్లమ్మ తల్లిని దర్శించుకోవడానికి వెళ్తుండగా రావిర్యాల, వాండర్ల సమీపంలో గుర్తు తెలియని డీసీఎం వాహనం రాష్ డ్రైవింగ్ తో బైక్ ను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొమ్మగోని ప్రశాంత్ గౌడ్(40) అక్కడికక్కడే మృతి చెందాడు. అతని కుమారుడు శ్రీతన్(11) తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరణించాడు. తీవ్ర గాయాల పాలైన భార్య కొమ్మగోని వాణి,కూతురు శశిక(10)చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఆదిబట్ల సీఐ రవికుమార్ తెలిపారు.

## లంచం డిమాండ్‌పై ఫిర్యాదు పోలీస్ అధికారుల పట్టివేత

### - అవినీతి జరిగితే ప్రజలు ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలి

### - తాండూర్ మున్సిపల్ కౌన్సిలర్ ఇర్షాద్




**వికారాబాద్,మెట్రో న్యూస్ :** వ్యక్తిగత కుటుంబ వివాదానికి సంబంధించిన కేసులో లంచం డిమాండ్ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. తాండూర్ మున్సిపల్ కౌన్సిలర్ ఇర్షాద్ తెలిపిన వివరాల ప్రకారం, తన కుటుంబ సమస్యను తప్పుదారి పట్టించి సెక్షన్ 498ఏ కింద కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.ఈ సందర్భంగా వికారాబాద్ ఉమెన్స్ పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ బెయిల్ పేరుతో ఒక్కొక్కరికి 10,000 చొప్పున మొత్తం 60,000 లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. అవినీతి డిమాండ్‌ను సహించలేక సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో, లంచం స్వీకరిస్తున్న సమయంలో పోలీస్ అధికారులు పట్టుబడినట్లు తెలిపారు.ఇది వ్యక్తిగత విషయం మాత్రమే కాకుండా సమాజంలో జరుగుతున్న అవినీతిపై పోరాటమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు ఐదుగురు అవినీతి అధికారులను చట్టం ముందు నిలబెట్టడంలో తాను భాగస్వామి అయినట్లు చెప్పారు.అవినీతి ఎక్కడ జరిగినా ప్రజలు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, చట్టం వారికి అండగా ఉంటుందని కౌన్సిలర్ ఇర్షాద్ విజ్ఞప్తి చేశారు.

## బిఆర్ఎస్ పార్టీకి కర్నె అరవింద్ సేవలు మరువలేనివి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

### అరవింద్ చిత్రపటానికి నివాళులు అర్పించిన హరీష్ రావు



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** కర్నె అరవింద్ బిఆర్ఎస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివాని మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఈ మేరకు ఆదిబట్ల సర్కిల్ పరిధిలోని వైఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ సోదరుని కుమారుడు తెలంగాణ ఉద్యమకారుడు, బిఆర్ఎస్ స్పోక్స్ పర్సన్ కర్నె అరవింద్ ఇటీవలే గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం ఆయన దశదిన కర్మ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు, బిఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి,బిఆర్ఎస్ రాష్ట్ర యువ నేత మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి (బంటీ)హాజరైయ్యారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. కర్నె అరవింద్ బిఆర్ఎస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని, అలాగే తెలంగాణ ఉద్యమ సమయంలో చాలా చురుకైనా పాత్ర పోషించాడని కొనియాడారు. అలాగే బిఆర్ఎస్ తరుపున స్పోక్స్ పర్సన్ గా ఎన్నో డెబిట్ కార్యక్రమాలలో పాల్గొన్ని సరైన రీతిలో సమాధానాలు తెలిపేవారని, అలాంటి గొప్ప వ్యక్తిని కోల్పోయినందుకు చాలా బాధగా ఉందని పేర్కొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ను ఓదార్చి, అయనకు మనోధైర్యం కల్పించాడు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ ఇంచార్జి క్యామ మల్లేష్ ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి, నాయకులు జెర్కొని రాజు, మదుపు శివసాయి ,ఏనుగు భారత్ రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

# ఎన్డీయేతోనే తమిళనాడుకు పూర్వ వైభవం చంద్రబాబు




చెన్నై తమిళనాడులో రెండో రోజు ఏపీ సీఎం చంద్రబాబు పర్యటిస్తున్నారు. ఎన్డీయే తరపున ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రెస్మీట్ నిర్వహించారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రం ఉదారంగా నిధులు ఇస్తున్నప్పుడు వినియోగించుకోవాలి కదా. సంక్షేమ కార్యక్రమాల కోసం చెన్నైకి కేంద్రం రూ.14 లక్షల కోట్లు ఇచ్చింది. కేంద్ర నిధులను దారి మళ్లించడం సమంజసమా? ః అని చంద్రబాబు ప్రశ్నించారు.
తమిళనాడుకు పూర్వ వైభవం రావాలంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలి. దేశానికి నరేంద్ర మోదీ వంటి సమర్ధ నాయకత్వం ఉంది. సరైన సమయంలో మంచి ఆలోచన చేయాలని తమిళనాడు ప్రజలను కోరుతున్నా. సమర్థులను ఎన్నుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుంది" అని చంద్రబాబు అన్నారు.

## కారుణ్య నియామకాలపై ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు డెడ్ లైన్





రాష్ట్రంలో కారుణ్య నియామకాలు భారీగా పెరిగిపోతుండటంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ సాధారణ నియామకాల కంటే ఈ తరహా నియామకాలే ఎక్కువగా ఉండటం వల్ల నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతోందని కోర్టు అభిప్రాయపడింది. ఈ మేరకు కారుణ్య నియామకాల ప్రక్రియను క్రమబద్ధీకరించేలా మూడు నెలల్లోగా కొత్త మార్గదర్శకాలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## మచిలీపట్నం ఆస్పత్రిలో మంత్రి కొల్లు రవీంద్ర ఆకస్మిక తనిఖీలు



మచిలీపట్నం సర్వజన ప్రభుత్వాస్పత్రిలో ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర బైకుపై వచ్చి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పార్కింగ్ చేయకుండా అడ్డదిడ్డంగా ఉన్న వాహనాలను చూసి సెక్యూరిటీ విభాగంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టం వచ్చినట్లుగా వాహనాలు పార్కింగ్ చేస్తుంటే సిబ్బంది ఏం చేస్తున్నారని మందలించారు. అనంతరం పలు విభాగాల్లో తనిఖీలు చేశారు. అలాగే, ఓపీ రిజి(స్టేషన్లను పరిశీలించి.. ఓపీలో చాలామంది రోగులు వేచి ఉండటంపై మంత్రి ఆరా తీశారు.
కౌంటర్ల సంఖ్యను పెంచాలని సూపరింటెండెంట్‌కు మంత్రి ఆదేశించారు. ఓపీలో రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. రక్తనమూనా పరీక్షల విభాగం, ఎక్సరే విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రి వైద్యులతో సమావేశమై వైద్య సేవల గురించి చర్చించారు. పారిశుద్ధ్య, పార్కింగ్ వ్యవస్థను మెరుగుపర్చాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు.



## సీఎం చంద్రబాబుకు మంత్రి పొన్నం లేఖ

హైదరాబాద్ రాష్ట్ర విభజనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎవరికీ మంచిది కాదని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. భాజపా, తెదేపా నేతలు, జనసేన అధినేత వ్యాఖ్యలు సముచితంగా లేవు. రాష్ట్ర విభజన అనుచితంగా జరిగినట్లు చేసే వ్యాఖ్యలు విద్వేషాలు రగిలించేలా ఉన్నాయి. మీరు చొరవ తీసుకుని నేతలకు సర్దిచెప్పాలి. విభజనపై ఎంపీ తేజస్వి వ్యాఖ్యల విషయమై స్పీకర్కు లేఖ రాయాలి. ఆ వ్యాఖ్యలను లోక్సభ రికార్డుల నుంచి తొలగించేలా చూడాలి. రెండు రా(ష్ట్రాలు పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో సాగడం తక్షణ అవసరంః అని లేఖలో పొన్నం పేర్కొన్నారు. తన వినతిని అర్థం చేసుకుని తగిన విధంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

# హైదరాబాద్ నుండి వైజాగ్‌కు ఇంకాస్త స్పీడ్‌గా వెళ్లొచ్చు



ఈ రహదారికి "గ్రీన్ ఫీల్డ్" అని పేరు పెట్టడానికి కారణం ఇది పాత రోడ్లను ఆనుకుని కాకుండా, పూర్తిగా కొత్తగా పొలాల మధ్య నుంచి నిర్మించబడటమే. దీనివల్ల మలుపులు తక్కువగా ఉండి, వాహనాలు గంటకు 100-120 కి.మీ వేగంతో వెళ్లేలా డిజైన్ చేశారు. పచ్చని పొలాలు, చెట్ల మధ్య నుంచి సాగే ఈ 4 లేన్ల ప్రయాణం వాహనదారులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. అంతేకాకుండా, ఈ రూట్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవు కాబట్టి ఇంధనం కూడా ఆదా అవుతుంది.

కిలోమీటర్ ఆధారిత టోల్ వసూలు

ఈ కొత్త హైవేపై మరో విశేషం ఏమిటంటే కిలోమీటర్ ఆధారిత టోల్. వాహనదారులు హైవేపై ఎంత దూరం ప్రయాణిస్తే అంత మేరకే టోల్ చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం వైరా, పొంగుటూరు వంటి కీలక ప్రాంతాల్లో టోల్ ప్లాజాలను ఏర్పాటు చేశారు.



ఈ రహదారి కేవలం వైజాగ్ వెళ్లే వారికే కాకుండా, ఏలూరు, రాజమండ్రి మరియు కోనసీమ వెళ్లే వారికి కూడా ఎంతో ప్రయోజనకరంగా మారింది. భవిష్యత్తులో ఈ రోడ్డు ఖమ్మం - విజయవాడ మరియు అమరావతి కనెక్టివిటీకి కూడా కీలకం కానుంది.








# పిఠాపురంలో మరోసారి ప్లెక్సీ వివాదం

ఈ వివాదం కాస్తా ముదిరి జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు మరియు వర్మ మధ్య తోపులాటకు దారితీసింది. దొరబాబు తనపైకి దూసుకురావడాన్ని వర్మ తీవ్రంగా పరిగణించారు. గతంలో వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చిన వారు ఇప్పుడు జనసేన ముసుగులో పెత్తనం చెలాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. గెలిపించిన కూటమి నాయకులపైనే దాడులకు దిగడం సరైన పద్ధతి కాదని, ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలను సముదాయించారు.

ఒక్కటిగా ఉంటాం కానీ తగ్గం జనసేన, టీడీపీ ఒకే కుటుంబమని వర్మ చెబుతూనే, చంద్రబాబుకు అవమానం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గెలుపు కోసం తాము ప్రాణప్రదంగా పనిచేశామని, అయితే కొందరు కొత్తగా చేరిన నాయకులు విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. క్రమశిక్షణ తప్పితే "తోలు తీస్తా" అంటూ దొరబాబును ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ మరియు చంద్రబాబు నాయుడు మధ్య ఉన్న సఖ్యతను దెబ్బతీసేలా ప్రవర్తించవద్దని ఆయన హితవు పలికారు.

# జాతీయ సివిల్ సర్వీసెస్ డే

## అధికారులకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

పరిపాలనలో సమర్థత, పారదర్శకత, జవాబుదారీతనం సివిల్ సర్వెంట్ల ప్రాథమిక బాధ్యత అని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ప్రభుత్వ యంత్రాంగం పౌర కేంద్రీకృతంగా పనిచేయాలని, సామాన్యుడికి పాలన చేరువ కావాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో అధికారులు చూపే నిబద్ధత, క్రమశిక్షణే దేశ పురోగతికి ఇంధనంగా మారుతాయని కొనియాడారు.

ప్రభుత్వ విధానాలను ఆచరణలోకి తీసుకురావడంలో సివిల్ సర్వెంట్ల పాత్ర అత్యంత కీలకమని చంద్రబాబు కొనియాడారు. వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి అధికారి ఒక చోదక శక్తిగా పనిచేయాలని ఆకాంక్షించారు. వ్యవస్థల మెరుగుదలకు, జవాబుదారీతనాన్ని నిలబెట్టడానికి అధికారులు చేస్తున్న కృషి అమూల్యమైనదని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు.




## ఆటోలో నుంచి జారిపడి యువతి దుర్మరణం



ఆదివారం సెలవు రోజైనప్పటికీ, షాపు ప్రచారం కోసం యాజమాన్యం సూచన మేరకు రేణుక ఆటోలో బయలుదేరింది. సిరిపురం, మురపాక వంటి గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేసి, తిరిగి ఇంటికి వస్తుండగా నరవ గ్రామ శివారులోని హనుమాన్ ఆలయం వద్ద ప్రమాదం జరిగింది. ప్రయాణంలో ఉండగా ఆటో నుంచి ప్రమాదవశాత్తూ కింద పడిపోవడంతో ఆమె తలకు బలమైన గాయమైంది. ఆసుపత్రికి తరలించే లోపే ఆమె ప్రాణాలు విడిచింది.
పెళ్లి పనులు మొదలుకావాల్సిన ఇంట్లో ఇప్పుడు చావు మేళం వినిపిస్తోంది. "వెళ్లొస్తానమ్మా" అని చెప్పిన బిడ్డ విగతజీవిగా తిరిగి రావడంతో తల్లిదండ్రులు గుండె పగిలేలా విలపిస్తున్నారు. అటు పెళ్లి కొడుకు కుటుంబం కూడా ఈ ఘటనతో ది(గ్భ్రాంతికి గురైంది. అందరితో ఎంతో కలివిడిగా ఉండే రేణుక ఇక లేదన్న వార్తను గ్రామస్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.






## సింగపూర్ చేరుకున్న ఏపీ మంత్రుల బృందం

వరల్డ్ బ్యాంక్, సింగపూర్ ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటైన 'సింగపూర్-ఏపీ జాయింట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ వరల్డ్ క్లాస్' ఒప్పందంలో భాగంగా ఈ పర్యటన. ఇందులో భాగంగా 'నేషన్ ఫస్ట్' వంటి నాయకత్వ సూత్రాలు, రాజకీయ జవాబుదారీతనం, పారదర్శక పాలనపై నిర్వహించే 'ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్' సెషన్లలో మంత్రులు పాల్గొంటారు. రాష్ట్రంలో ఆధునిక పరిపాలనను ప్రవేశపెట్టేందుకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.
మౌలిక సదుపాయాల కల్పన, పట్టణ ప్రణాళిక, ప్రజా సేవల నిర్వహణలో సింగపూర్ ప్రపంచ ప్రసిద్ధి గాంచింది. అక్కడి విజయవంతమైన విధానాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటిని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అన్వయించుకోవడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యం. ఈ పర్యటన ముగిసిన అనంతరం, రాష్ట్ర పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే దిశగా కేబినెట్‌లో పలు కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అంబటి రాంబాబుపై మరో కేసు నమోదు



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై పోలీసులు మరో కేసు నమోదు చేశారు. శనివారం గుంటూరు కలెక్టరేట్ ముందు నిర్వహించిన నిరసన దీక్ష కారణంగా ఈ కేసు నమోదు అయినట్లు పోలీసులు తెలిపారు.

నిరసన దీక్ష కారణం తన ఇంటిపై దాడి చేసిన వారిని ఇప్పటికీ అరెస్ట్ చేయలేదని ఆరోపిస్తూ అంబటి రాంబాబు ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని, అలాగే గతంలో తనను కస్టడీలో హింసించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ ఇబ్బందుల ఆరోపణ అనుమతి లేకుండా కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టడంతో ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు కలిగాయని పోలీసులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గుంటూరులోని నగరపాలెం పోలీస్ స్టేషన్‌లో అంబటి రాంబాబుపై కేసు నమోదు చేశారు.

# ఇది సర్పంచ్ సాబ్ అడ్డా



శ్రేయస్ అయ్యర్ హవా శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీ లెక్కలను పరిశీలిస్తే.. అతడి ఎదుగుదల స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు శ్రేయస్ అయ్యర్ మొత్తం 93 ఐపీఎల్ మ్యాచ్‌లకు నాయకత్వం వహించగా.. అందులో 55 మ్యాచ్‌ల్లో విజయం సాధించాడు. కేవలం 35 మ్యాచ్‌ల్లో మాత్రమే ఓటమిని చవిచూశాడు. దీంతో శ్రేయస్ అయ్యర్ గెలుపు శాతం 59.13 శాతానికి చేరుకుంది. ఐపీఎల్ చరిత్రలో సుదీర్ఘకాలం కెప్టెన్లుగా ఉన్న రోహిత్ శర్మ, ధోనీల రికార్డులకు ఇది గట్టి పోటీనిస్తోంది.

జట్టు ఏదైనా.. గెలుపే లక్ష్యంగా! శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలోని ప్రత్యేకత ఏంటంటే.. ఆయన ఏ జట్టుకు సారథ్యం వహించినా తనదైన ముద్ర వేస్తున్నాడు. మొదటి ఢిల్లీ క్యాపిటల్స్ జట్టును విజయపథంలో నడిపించిన ఆయన.. ఆ తర్వాత కేకేఆర్ జట్టుకు 2024లో టైటిల్‌ను అందించాడు. ఇప్పుడు పంజాబ్ కింగ్స్ జట్టును కూడా ఓ బలమైన శక్తిగా తీర్చిదిద్దుతున్నాడు. సీనియర్ ప్లేయర్ల నుంచి అత్యుత్తమ ప్రదర్శనను ఎలా రాబట్టాలో తెలిసిన చతురత కలిగిన నాయకుడిగా శ్రేయస్ అయ్యర్ గుర్తింపు పొందాడు.

ధోనీ, రోహిత్‌లతో పోలిక ఎంఎస్ ధోనీ సీఎస్కేను ఓ బ్రాండ్‌గా మార్చితే.. రోహిత్ శర్మ ముంబైని 5 సార్లు ఛాంపియన్‌గా నిలిపాడు. అయితే ప్రస్తుత గెలుపు శాతం రేసులో శ్రేయస్ అయ్యర్ వీరిద్దరినీ సవాలు చేస్తున్నాడు. ఒత్తిడిలో కూడా పట్టు వదలకుండా, జట్టుకు అండగా నిలబడటం శ్రేయస్ అయ్యర్ స్టైల్. సౌరవ్ గంగూలీలో ఉండే దూకుడు, ఎంఎస్ ధోనీలో ఉండే నిలకడ రెండూ కలిసిన వ్యక్తిత్వమే శ్రేయస్ అయ్యర్ అని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతన్నారు. స్టేడియంలో బౌలింగ్ మార్పులు చేయడం లేదా ఫీల్డింగ్ సెట్ చేయడంలో శ్రేయస్ అయ్యర్ తీసుకునే నిర్ణయాలు ఆయనను ఓ తెలివైన వ్యూహకర్తగా నిలబెట్టాయి. ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే, ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్ల జాబితాలో శ్రేయస్ అయ్యర్ అగ్రస్థానానికి చేరుకోవడం ఖాయమనిపిస్తోంది. ఐపీఎల్ ప్రపంచానికి ఓ కొత్త నాయకుడు దొరికాడని 59.13 శాతం విన్నింగ్ రేట్ స్పష్టంగా చెబుతోంది.

# ICUలో ప్రాణాలతో పోరాడుతున్న స్టార్ క్రికెటర్!





అఫ్ఘానిస్థాన్ క్రికెట్ చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మాజీ స్టార్ పేస శపూర్ జద్రాన్ ప్రస్తుతం ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. ప్రస్తుతం ఢిల్లీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. శపూర్ జద్రాన్ శరీరమంతా ఇన్ఫెక్షన్ వ్యాపించడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

హెచ్ఎల్‌హెచ్ అనే అరుదైన వ్యాధి అఫ్ఘానిస్థాన్ క్రికెటర్ శపూర్ జద్రాన్ హెమొఫాగోసైటిక్ లింఫోహిస్టియోసైటోసిస్ అనే అత్యంత అరుదైన, ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్నాడు. ఆయనకు ప్రస్తుతం ఈ వ్యాధి నాలుగో దశలో ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. శపూర్ సోదరుడు ఘమాయ్ జద్రాన్ ఈ విషయంపై స్పందిస్తూ.. ఇది చాలా తీవ్రమైన ఇన్ఫెక్షన్. ఇది ఆయన శరీరమంతా వ్యాపించడమే కాకుండా, మెదడుపై కూడా ప్రభావం చూపింది అని ఆవేదన వ్యక్తం చేశాడు.

కోలుకుంటున్న దశలో డెంగ్యూ దాడి

గతేడాది అక్టోబర్ నెలలో శపూర్ జద్రాన్ తొలిసారిగా అనారోగ్యానికి గురయ్యాడు. మెరుగైన చికిత్స కోసం ఆయనను జనవరి 19న ఢిల్లీకి తరలించారు. మధ్యలో ఆయన ఆరోగ్యం కొంత మెరుగుపడినట్లు అనిపించినా.. దురదృష్టవశాత్తు ఇన్ఫెక్షన్ మళ్లీ తిరగబెట్టింది. దీనికి తోడు ఆయనకు డెంగ్యూ సోకడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. ప్రస్తుతం ఆయన శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గిపోవడమే కాకుండా ఎర్ర రక్త కణాలు కూడా భారీగా పడిపోయాయని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

అండగా నిలిచిన రషీద్ ఖాన్, అఫ్ఘాన్ క్రికెట్ బోర్డు శపూర్ జద్రాన్ ఎదుర్కొంటున్న ఈ క్లిష్ట సమయంలో అఫ్ఘాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్, అఫ్ఘానిస్థాన్ క్రికెట్ బోర్డు అండగా నిలిచాయి. రషీద్ ఖాన్ స్వయంగా పూనుకుని ఆయన వైద్య ఖర్చులకు సాయం చేయడమే కాకుండా.. ఢిల్లీలో చికిత్స అందేలా ఏర్పాట్లు చేశారు. ఇటీవల ముంబై ఇండియన్స్ స్పిన్నర్ అల్లా ఘజన్‌ఫర్ కూడా ఆస్పత్రికి వెళ్లి శపూర్‌ను పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు ప్రార్థిస్తున్నారు.

క్రికెట్ ప్రస్థానం శపూర్ జద్రాన్ 2009 నుంచి 2020 వరకు అఫ్ఘానిస్థాన్ తరఫున 44 వన్డేలు, 36 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. 2015 ప్రపంచకప్‌లో స్కాట్లాండ్‌పై అఫ్ఘానిస్థాన్ చారిత్రక విజయం సాధించడంలో ఆయన కీలక పాత్ర పోషించాడు. గతేడాది మాత్రమే క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ఆయన.. అంతలోనే ఇలా ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడం క్రికెట్ ప్రపంచాన్ని కలచివేస్తోంది.

# తెలుగోడి విధ్వంసం..ముంబై ఇండియన్స్ ఘన విజయం!




ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తమ పరాజయాల పరంపరకు బ్రేక్ వేసింది. వరుసగా నాలుగు పరాజయాల తర్వాత రెండో విజయాన్ని అందుకుంది. సోమవారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ముంబై ఇండియన్స్ 99 పరుగుల భారీ తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చేసింది. తద్వారా ఐపీఎల్ చరిత్రలోనే ముంబై ఇండియన్స్ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ భారీ విజయంతో ముంబై రన్‌రేట్ మెరుగైంది.


తెలుగు తేజం తిలక్ వర్మ అజేయ శతకంతో చెలరేగగా.. బౌలింగ్‌లో యువ బౌలర్ అశ్వని కుమార్ నిప్పులు చెరిగాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 199 పరుగులు చేసింది. తిలక్ వర్మ(45 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్స్‌లతో 101 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగగా.. నమన్ ధీర్(32 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 45) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. గుజరాత్ బౌలర్లలో కగిసో రబడా(3/33) మూడు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ తలో వికెట్ తీసారు.

అనంతరం గుజరాత్ టైటాన్స్ 15.5 ఓవర్లలో 100 పరుగులకు కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. వాషింగ్టన్ సుందర్(17 బంతుల్లో 5 ఫోర్లతో 26) టాప్ స్కోరర్‌గా నిలవగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో అశ్వని కుమార్(4/24) నాలుగు వికెట్లు తీయగా.. మిచెల్ సాంట్నర్(2/16), అల్లా ఘజన్‌ఫర్(2/17) రెండేసి వికెట్లు పడగొట్టారు. జస్‌ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా తలో వికెట్ తీసారు. వరుసగా మూడు విజయాల తర్వాత గుజరాత్ టైటాన్స్ జోరుకు ముంబై బ్రేక్ వేసింది.

మ్యాచ్ టర్నింగ్ పాయింట్.. గుజరాత్ టైటాన్స్ యువ పేసర్ అశోక్ శర్మ వేసిన 18వ ఓవర్ ఈ మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా మారింది. ఈ ఓవర్‌లో తిలక్ వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. వరుసగా ఐదు బంతులను 6, 4, 4, 6, 6 బౌండరీలకు తలించి 26 పరుగులు పిండుకున్నాడు. ఆఖరి బంతిని అంచనా వేయడంలో విఫలమైన తిలక్ వర్మ తీవ్రంగా గాయపడ్డాడు. గంటకు 150 కిలోమీటర్ల వేగంతో వేసిన ఆఖరి బంతి అతని ప్రైవేట్ పార్ట్ భాగంలో బలంగా తాకడంతో నొప్పితో విలవిలలాడాడు.

అయితే ఈ గాయం అతని దూకుడుకు అడ్డుగా నిలవలేదు. ఈ ఓవర్‌తో మూమెంటమ్ అందుకున్న తిలక్ వర్మ మరో 7 బంతుల్లో రెండు సిక్స్‌లు, మూడు బౌండరీలు బాది సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఓవర్‌కు ముందు ముంబై ఇండియన్స్ 141/4 స్కోర్‌తో నిలిచింది. అశోక్ వర్మ కాస్త కట్టడిగా వేసి ఉంటే ముంబై 165-170 పరుగులకే పరిమితమయ్యేది. కానీ తిలక్ వర్మ తన విధ్వంసతో మ్యాచ్‌ను మలుపు తిప్పి భారీ విజయాన్ని అందించాడు.

# బరువు తగ్గించే మందులతో కండరాలకు ముప్పు



ఈ మందులు ఆకలిని విపరీతంగా తగ్గించడం వల్ల శరీరానికి అందే కేలరీలు 40 శాతం వరకు పడిపోతున్నాయి. తగినంత ఇంధనం అందనప్పుడు శరీరం కొవ్వుతో పాటు కండరాల్లోని ప్రోటీన్‌ను కూడా శక్తి కోసం వాడుకుంటుంది. దీనివల్ల జీవక్రియ రేటు మందగించి, భవిష్యత్తులో మళ్ళీ బరువు పెరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వయసు పైబడిన వారిలో కండరాలు తగ్గడం వల్ల నీరసం రావడం, త్వరగా కింద పడి గాయాల పాలు కావడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయని పరిశోధనలో తేలింది.

కండరాలను కాపాడుకునే మార్గాలు

బరువు తగ్గే ప్రక్రియలో కండరాల నష్టాన్ని అరికట్టడానికి పోషకాహారం మరియు వ్యాయామం చాలా ముఖ్యం. రోజువారీ ఆహారంలో ప్రోటీన్ అధికంగా ఉండేలా చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో పాటు క్రమం తప్పకుండా కండరాలకు బలాన్నిచ్చే వ్యాయామాలు చేయడం వల్ల శరీరం ఆకృతి కోల్పోకుండా ఉంటుంది. కేవలం బరువు తగ్గడమే లక్ష్యంగా కాకుండా, ఆరోగ్యకరమైన పద్ధతిలో బరువును నియంత్రించుకోవడంపై దృష్టి పెట్టాలని ఈ అధ్యయనం హెచ్చరిస్తోంది.

ఆరోగ్యకరమైన ఫిట్‌నెస్ కోసం జాగ్రత్తలు

వారానికి కనీసం రెండుసార్లు బరువులు ఎత్తే వ్యాయామాలు తప్పనిసరిగా చేయాలి.

ప్రతి కిలో శరీర బరువుకు సుమారు 1.5 గ్రాముల ప్రోటీన్ అందేలా పప్పులు, గుడ్లు లేదా మాంసం తీసుకోవాలి.

శరీరంలో శక్తి తగ్గకుండా ఉండటానికి విటమిన్లు మరియు యాంటీ ఆక్సిడెంట్లు ఉన్న పండ్లను ఆహారంలో చేర్చుకోవాలి.

వైద్యుల పర్యవేక్షణ లేకుండా సొంతంగా వెయిట్ లాస్ మందులను వాడటం ఏమాత్రం క్షేమదాయకం కాదు.

రోజూ నడకతో పాటు యోగా చేయడం వల్ల శారీరక స్థిరత్వం మరియు మానసిక ఉల్లాసం లభిస్తాయి.

# కీరదోసకాయ నీళ్లు VS నిమ్మరసం



కీరదోసకాయలో నీటి శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. దీనిని నీటిలో నానబెట్టి ఆ నీటిని తాగడం వల్ల శరీరానికి కలిగే ప్రయోజనాలు ఇవే:

శరీరానికి చలవ: ఇది సహజసిద్ధంగా శరీరాన్ని చల్లబరుస్తుంది.

ఎలక్ట్రోలైట్లు: శరీరానికి అవసరమైన విటమిన్లు మరియు ఎలక్ట్రోలైట్లను అందించి, నీరసం రాకుండా చూస్తుంది.

జీర్ణక్రియ: కీరదోసకాయ నీళ్లు జీర్ణక్రియను మెరుగుపరిచి, శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపిస్తాయి.

నిమ్మరసం వేసవిలో అందరూ ఇష్టపడే పానీయం. దీని వల్ల కలిగే ఉపయోగాలు:

రోగనిరోధక శక్తి: నిమ్మరసంలో ఉండే విటమిన్-సీ రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

**కిడ్నీల ఆరోగ్యం:** ఇది మూత్రపిండాలపై ఒత్తిడిని తగ్గించి, యూరినరీ ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది.

ఇన్‌స్టంట్ ఎనర్జీ: ఎండ వల్ల కలిగే అలసటను తొలగించి, తక్షణ శక్తిని ఇస్తుంది.

**నిపుణుల సూచన** కీరదోసకాయ నీళ్లు, నిమ్మరసం రెండూ వేర్వేరు ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. కాబట్టి, ఏదో ఒకదానికే పరిమితం కాకుండా ఈ రెండింటిని మార్చి మార్చి తీసుకోవడం మంచిదని నిపుణులు వివరిస్తున్నారు. ఇలా చేయడం వల్ల శరీరానికి అన్ని రకాల పోషకాలు అందడమే కాకుండా, వేసవి తాపం నుండి రక్షణ లభిస్తుంది.





# మీ దంతాలు త్వరగా పాడవ్వకూడదంటే

## ఈ అలవాటు మార్చుకోండి



మనం నిద్రపోతున్నప్పుడు నోటిలో లాలాజలం ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. లాలాజలం అనేది నోటిలోని బ్యాక్టీరియాను అరికట్టే సహజ రక్షణ కవచం. రాత్రి బ్రష్ చేయకుండా పడుకుంటే, పళ్లపై పేరుకున్న చక్కెర మరియు ఆహార అవశేషాలపై బ్యాక్టీరియా వేగంగా దాడి చేస్తుంది. ఇది నోటిలో ఆమ్లాలను ఉత్పత్తి చేసి దంతాల ఎనామెల్‌ను దెబ్బతీస్తుంది. ఫలితంగా పిప్పి పళ్లు, నోటి దుర్వాసన వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. అందుకే రాత్రి పూట శుభ్రం చేసుకోవడం చాలా ముఖ్యం.

దంతాల రక్షణ కోసం పాటించాల్సిన ముఖ్యమైన సూత్రాలు

ప్రతిరోజూ ఉదయం మరియు రాత్రి పడుకునే ముందు ఖచ్చితంగా బ్రష్ చేయాలి.

పళ్ల మధ్య ఇరుక్కున్న వ్యర్థాలను తొలగించడానికి ఫ్లోసింగ్ చేయడం అలవాటు చేసుకోవాలి.


నాలికపై పేరుకున్న పాచిని క్లీనర్ సహాయంతో రోజూ శుభ్రం చేసుకోవాలి.

యాంటీ బ్యాక్టీరియల్ మౌత్ వాష్‌తో నోటిని పుక్కిలించడం వల్ల సూక్ష్మక్రిములు నశిస్తాయి.

తీపి పదార్థాలు తిన్న తర్వాత ప్రతిసారీ మంచి నీటితో నోటిని శుభ్రంగా కడుక్కోవాలి.

ఆరోగ్యమే మహాభాగ్యం: నోటి శుభ్రతతోనే సాధ్యం!

నోటి ఆరోగ్యం కేవలం దంతాలకే పరిమితం కాదు, ఇది మొత్తం శరీర ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. నోటిలోని ఇన్ఫెక్షన్లు రక్తంలోకి చేరితే గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. రాత్రి పూట కేవలం రెండు నిమిషాలు కేటాయించి బ్రష్ చేయడం వల్ల మీరు భవిష్యత్తులో పడే పెద్ద పెద్ద ఇబ్బందులను అరికట్టవచ్చు. కాబట్టి బద్ధకాన్ని వదిలి, ఆరోగ్యకరమైన చిరునవ్వు కోసం రాత్రి పూట బ్రష్ చేయడాన్ని మీ జీవనశైలిలో భాగం చేసుకోండి.



# మెట్రో ఈవినింగ్ సినిమా

# నాని ప్యారడైజ్ షూటింగ్







నిర్మాతలు ఈ చిత్రాన్ని ఆగస్టు 2026లో విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. షూటింగ్ పూర్తయిన తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనుల కోసం సుమారు 4 నెలల సమయాన్ని కేటాయించారు. గ్రాఫిక్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మరియు ఎడిటింగ్ విషయంలో అత్యున్నత నాణ్యతను పాటించేందుకే ఈ సమయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన 'ఆయా షేర్' సాంగ్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేయడమే కాకుండా, సినిమాపై హైప్‌ను అకాశానికి తీసుకెళ్లింది.

నాని ఖాతాలో మరో హిట్ పక్కా?

వరుస విజయాలతో దూసుకుపోతున్న నాని, ఈ సినిమాతో తన సత్తాను మరోసారి చాటాలని చూస్తున్నారు. దసరా సినిమాలో ధరణి పాత్రలో ఎలాగైతే మెప్పించారో, అంతకు మించి 'ది ప్యారడైజ్'లో పెర్ఫార్మెన్స్ ఉంటుందని ఫిల్మ్ నగర్ టాక్. పక్కా ప్లానింగ్‌తో షూటింగ్ ముగించి, సకాలంలో థియేటర్లలోకి వస్తే నాని కెరీర్‌లో ఇది మరో బిగ్గెస్ట్ హిట్ కావడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా నాని-శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ బాక్సాఫీస్ వద్ద పక్కాగా మ్యాజిక్ రిపీట్ చేస్తుందని ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## గ్లామర్ డోస్ పెంచిన రుక్మిణి వసంత్



గ్లామర్ డోస్ పెంచిన రుక్మిణి వసంత్.. ఎప్పటికప్పుడు సాంప్రదాయ దుస్తుల్లో కనిపిస్తూ ఏమాత్రం గ్లామర్‌కు చోటు ఇవ్వకుండా సింపుల్గా, ట్రెడిషనల్‌గా కనిపించే ఈ ముద్దుగుమ్మ.. సమ్మర్ వేళ ఇలాంటి హాట్ డోస్ పెంచి మరింత హీటెక్కిస్తోంది అని కొంతమంది కామెంట్లు చేస్తుంటే.. మరి కొంతమంది నీ అందానికి తట్టుకోలేక పోతున్నాం అంటూ తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. 1994 డిసెంబర్ 10న కర్ణాటక బెంగళూరులో కన్నడ మాట్లాడే కుటుంబంలో జన్మించింది రుక్మిణి. ఈమె తండ్రి కల్నల్ వసంత్ వేణుగోపాల్. భారతదేశ అత్యున్నత శాంతికాల సైనిక అలంకరణ అయిన అశోక చక్ర కర్ణాటక రాష్ట్రం నుండి పొందిన మొదటి వ్యక్తి. సప్త సాగరాలు దాచేయేల్లో , బాణదరియల్లి, భగీర వంటి కన్నడ చిత్రాలు చేసింది రుక్మిణి. పైడిపల్లి-దిల్‌రాజు కాంబో: మాస్ హీరోకు ఫ్యామిలీ ఎమోషన్స్ తోడైతే బాక్సాఫీస్ హిట్టే రుక్మిణి తెలుగు సినిమా కెరియర్.. అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అనే తెలుగు చిత్రం ద్వారా ప్రేక్షకులను పలకరించిన ఈమె.. ప్రస్తుతం ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో వస్తున్న డ్రాగన్ సినిమాలో నటిస్తోంది.అలాగే హీరో శింబు అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో చేస్తున్న కొత్త సినిమాలో కూడా అవకాశం అందుకుంది. ఈ చిత్రానికి ఏజీఎస్ భారీ బడ్జెట్ తో నిర్మించ నున్నారు.

## పట్టుచీరలో పండంటి చందమామలా డింపుల్



సాధారణంగా డింపుల్ హయాతిని మనం మోడరన్ అవుట్‌ఫిట్స్‌లో, గ్లామరస్ రోల్స్‌లో చూస్తుంటాం. కానీ తాజాగా ఈ బ్యూటీ గ్రీన్ కలర్ పట్టుచీర కట్టి అందరినీ ఆశ్చర్య పరిచింది. చీరకట్టులో తెలుగు ఆడపిల్లలా కనిపిస్తూనే, తనదైన శైలిలో గ్లామర్ టచ్ ఇచ్చింది. మెడలో ధరించిన భారీ కుందన్ నెక్లెస్ ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేసింది. సంప్రదాయానికి, స్టైల్‌కు పర్ఫెక్ట్ కాంబినేషన్ లా ఉన్న ఈలుక్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. రూ.200 కోట్లు కొట్టిన మలయాళం మూవీ.. తెలుగులో క్లిక్కయ్యేనా? జర్ర జర్ర భామ.. ఇప్పుడు గ్లామర్‌కు చిరునామా వరుణ్ తేజ్ గద్దలకొండ గణేష్ సినిమాలో జర్ర జర్ర పాటతో ఒక్కసారిగా పాపులర్ అయిన డింపుల్, ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. రవితేజ సరసన ఖిలాడీ, గోపీచంద్ తో రామబాణం వంటి సినిమాల్లో నటించి మెప్పించింది. చీరలో కూడా ఇంత హాట్‌గా ఉండటం నీకే చెల్లింది అంటూ ఫ్యాన్స్ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. ట్రెడిషనల్ లుక్ అయినా, మోడరన్ లుక్ అయినా డింపుల్ దేనికైనా సై అంటోంది. ఇక మొత్తానికి ఈ ఖిలాడీ బ్యూటీ తన అందచందాలతో సోషల్ మీడియాలో సెగలు పుట్టి స్తోంది.

## స్టార్ హీరోల సినిమాల వేగం



ప్రస్తుతం టాలీవుడ్ అగ్ర హీరోలు ప్రాంతీయ సరిహద్దులు దాటి పాన్ ఇండియా స్థాయిలో తిరుగులేని గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఈ గ్లోబల్ ఇమేజ్ వారి సినిమాల వేగాన్ని మాత్రం గణనీయంగా తగ్గించిందన్నది అంతే వాస్తవం. ఒకప్పుడు ఏడాదికి రెండు, మూడు సినిమాలు చేసిన స్టార్ హీరోలు ఇప్పుడు ఒక్క సినిమాను పూర్తి చేయడానికి ఏళ్ల తరబడి సమయం తీసుకుంటున్నారు. ఈ పరిణామం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతున్నా? అభిమాన నటుడిని వెండితెరపై తరచుగా చూడాలనుకునే అభిమానులకు మాత్రం నిరీక్షణగా మారుతోంది.

## 'రాజా శివాజీ' ట్రైలర్




ఛత్రపతి శివాజీ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన సినిమా 'రాజా శివాజీ'. ఇది తన డ్రీమ్ ప్రాజెక్టు కావడంతో రితేష్ దేశ్‌ముఖ్ టైటిల్ పాత్ర పోషిస్తూ, దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో జెనీలియా కూడా నటించారు. సంజయ్ దత్, అభిషేక్ బచ్చన్, విద్యాబాలన్ తదితర ప్రముఖులు కీలక పాత్రల్లో నటించారు. మే 1న విడుదల ఈ సినిమా విడుదల కానుంది.



## 'ఓం శాంతి డిస్కో శాంతి' విడుదల

టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మేకర్ మహి వి. రాఘవ్. యాత్ర, పాఠశాల వంటి ఎమోషనల్ చిత్రాలతో పాటు ఆనందో బ్రహ్మతో హారర్ కామెడీలో కొత్త ఒరవడి సృష్టించిన ఆయన, ఇప్పుడు మరో క్రేజీ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు.

ఈ చిత్రానికి గోగు ఆర్.ఆర్. దర్శకత్వం వహిస్తుండగా, మహి వి. రాఘవ్ స్వయంగా కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. త్రీ ఆటమ్ లీవ్స్ బ్యానర్‌పై శివ మేక, సాహితి చింతలపూడి నిర్మిస్తున్నారు. కృష్ణ కుమార్ సంగీతం అందిస్తుండగా, జ్ఞానశేఖర్ వి.ఎస్. విజువల్స్ అందిస్తున్నారు. మహి వి. రాఘవ్ గతంలో అందించిన సేవ్ ది టైగర్స్ వెబ్ సిరీస్ సూపర్ హిట్ కావడంతో, ఈ సినిమాపై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ఆల్ రెడీ కాషన్ కియా.. ఆల్ రెడీ అనే క్యాప్షన్ సినిమా పబ్లిసిటీకి ప్లస్ అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

రిలీజ్ డేట్ ఖరారు

హారర్ ఎలిమెంట్స్‌కు ఫన్నీ డైలాగులు, ఊహించని ట్విస్టులు జోడించి రూపొందిస్తున్న ఈ స్పూకీ ఫన్ జర్నీ సెప్టెంబర్ 4, 2026న థియేటర్లలో సందడి చేయబోతోంది. హారర్ కామెడీ జోనర్‌ను ఇష్టపడే ప్రేక్షకులకు 'ఓం శాంతి డిస్కో శాంతి' ఒక పర్ఫెక్ట్ ఎంటర్‌టైనర్ కానుంది.

## ఐటం భామగా అవతారం ఎత్తిన సీతమ్మ



కృతిసనన్ టాలీవుడ్, బాలీవుడ్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. తెలుగులో మహేష్, ప్రభాస్ లాంటి స్టార్ హీరోల చిత్రాల్లో భాగమైన అమ్మడి కెరీర్ అవి పెద్దగా ఉపయోగ పడలేదు. ఆ రెండు భారీ కాన్వాస్ పై తెరకెక్కిన సినిమాలే అయినా ఫలితాలు మాత్రం నిరాశపరిచాయి. అలాగని అమ్మడు టాలీవుడ్‌కు దూరంగా కాలేదు. ఇక్కడ పరిశ్రమకు టచ్ లో ఉంటూనే బాలీవుడ్ లో కూడా దిగ్విజయంగా కెరీర్‌ను కొనసాగిస్తోంది. అనతి కాలంలోనే జాతీయ ఉత్తమ నటిగా అవార్డు సైతం అందుకుని ఉత్తరాదిన తన ఇమేజ్‌ను అంతకంతకు పెంచుకుంది. ఛత్రపతి శివాజీ వీరత్వం.. ఎమోషనల్ విజువల్ ట్రీట్ ప్రస్తుతం బాలీవుడ్ బిజీ నాయికల్లో తాను కూడా ఒకరు. అదనంగా లేడీ ఓరియేంటెడ్ చిత్రాలతోనూ సత్తా చాటడం అమ్మడి ప్రత్యేకత. ఇలా కమర్షియల్ సినిమాలతో పాటు లీడ్ రోల్స్ పోషిస్తూ బిజీగా ఉంది. ఈ పాట సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



## విజయ్ దేవరకొండ కొత్త చిత్రం ప్రారంభం

ఈ చిత్రాన్ని వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. 'హాయ్ నాన్న' చిత్రానికి ప్రాణం పోసిన హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు కూడా సంగీతం అందిస్తుండటంతో అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ సినిమా గురించి విజయ్ దేవరకొండ తన సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "ఒక అద్భుతమైన గ్లోబల్ టీమ్ ఈ ప్రాజెక్ట్ కోసం పని చేస్తోంది. శౌర్యువ్ విజన్ అద్భుతం. ఈ సినిమా కోసం నా సర్వస్వం ధారపోస్తాను" అని ఎమోషనల్ పోస్ట్ చేశారు.

షూటింగ్ అప్‌డేట్స్ ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విజయ్ దేవరకొండ తన ప్రస్తుత ప్రాజెక్టులు పూర్తి చేసిన వెంటనే ఈ కొత్త సినిమా రెగ్యులర్ షూటింగ్‌లో పాల్గొననున్నారు. ఇందులో నటించబోయే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే చిత్ర బృందం అధికారికంగా ప్రకటించనుంది.



Published, Printed, Edited and Owned by **DEVARAKONDA KALIDAS** Printed at DK Publications, 2-3-691/1/A, CPL Main Road, Amberpet, Hyderabad and Published at D.No.1-9-628/4, J.P.Residency, Vidyangar, Hyderabad - 44, **Editor: D.Kalidas, RNI.NO.68319/98, Post Regd.No. HSE/953/2014-16** Phone: 99126 14007, 040-27421007